ఆంధ్రజ్యోతి
20
వికారాబాద్
ఆదివారం 20 ఆగస్టు 2017







నిధులపై లొల్లి

- సీనరేజ్, టీడీ నిధులు వెంటనే చెల్లించాలని ప్రతిపక్ష సభ్యుల బైఠాయింపు
- ప్లకార్డులు అందించిన అధికార పార్టీ సభ్యులు
- గ్రామాల్లో తిరగలేకపోతున్నామని సభ్యుల ఆందోళన
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- సమావేశం బహిష్కరణ
- పోలీసుల రంగ ప్రవేశం..
- వచ్చే యేడు నుంచి రెండు పంటలకు రూ. 8 వేలు : మంత్రి మహేందర్‌రెడ్డి
- ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి : జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి
- వికారాబాద్ సబ్‌కలెక్టర్‌పై సభ్యుల గుస్సా..
- వాడీవేడీగా జడ్పీ సమావేశం

8 లో



సమావేశ మందిర ఆవరణలో నిరసన తెలుపుతున్న జడ్పీటీసీలు, ఎంపీటీసీలు

స్థానిక సంస్థలకు నిధుల విడుదలలో జాప్యంపై జడ్పీ సమావేశంలో ప్రతిపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. నిధులు విడుదల చేయకపోవడంతో తాము గ్రామాల్లో తిరగలేకపోతున్నామని సమావేశం ఆరంభంలోనే సభ్యులు ఆందోళనకు దిగారు. కాగా ఇదే సమయంలో కొందరు అధికార పార్టీ సభ్యులు కూడా వీరికి మద్దతుగా ప్లకార్డులు అందించారు. స్థానిక సంస్థలకు ఇవ్వాల్సిన నిధులను ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకుంటోందని, దీంతో అవి నిర్వీర్యం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సభలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుదామని, సీఎంను కలిసి నిధుల మంజూరుకు కృషి చేస్తామని ఆందోళన విరమించాలని మంత్రి మహేందర్‌రెడ్డి కోరారు. అయినా.. సభ్యులు సమావేశాన్ని బహిష్కరిస్తున్నామంటూ ప్లకార్డులతో జడ్పీ కార్యాలయ ఆవరణలోకి ర్యాలీగా వెళ్లి ఆందోళన వ్యక్తం చేశారు.

అనంతగిరిలో అర్బన్ పీహెచ్‌సీ



అనంతగిరిలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్నాం. అక్కడ రెండు పీహెచ్‌సీ భవనాలున్నాయి. వైద్య సిబ్బంది లేనిది మనం ఏమీ చేయలేం. అర్బన్ పీహెచ్‌సీకి రెఫర్ చేస్తున్నాం. ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- కలెక్టర్ దివ్య

నిరుద్యోగులను మభ్యపెడుతున్న కేసీఆర్

- కేసీఆర్ ద్వంద్వ నీతి బయటపడింది
- యువత మరో పోరాటానికి సిద్ధం కావాలి
- ధర్నాచౌక్‌ను ఎత్తేయడం ఎంత వరకు సమంజసం
- టీఆర్ఎస్‌కు అనుకూలంగా జిల్లా పునర్విభజన
- టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి



7 లో

మిషన్ భగీరథ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి

జిల్లాలో శనివారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వికారాబాద్‌లో భారీ వర్షం, తాండూరు, పరిగి, కొడంగల్ ప్రాంతాల్లో చిరుజల్లులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. కురిసిన వర్షంతో పంటలకు కొంత ఊరట లభించింది.

- వికారాబాద్



ఆయుర్వేదంతో ఆరోగ్యం

- ఆయుర్వేదానికి పెరుగుతున్న ఆదరణ
- శాఖాహారం వైపే అందరి మొగ్గు
- వ్యాయామంపై దృష్టి సారిస్తున్న ప్రజలు

7



క్రీడాకారులు దేశానికి.. గుర్తింపు తేవాలి

- ఈ క్రీడలు మన రాష్ట్రానికే గర్వ కారణం
- ఎమ్మెల్యే సంజీవరావు
- అట్టహాసంగా జాతీయ జూనియర్ 'లగోరి' క్రీడలు ప్రారంభం
- బాలుర విభాగంలో ఫైనల్‌కు తెలంగాణ, మహారాష్ట్ర
- బాలికల విభాగంలో హర్యానా, పాండిచ్చేరి జట్లు
- నేడే ఫైనల్ పోటీలు

20



ఆటను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరావు

ఆంధ్రజ్యోతి / ఇంటర్వ్యూ

డిజిటలైజేషన్ దిశగా

గ్రంథాలయాలు

● అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు

● గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

● వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీనివాస్



వికారాబాద్: గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గ్రంథాలయాల్లోని పుస్తకాలను డిజిటలైజేషన్ చేసి పాఠకులు కోరిన పుస్తకాలను వెంటనే వారికి అందజేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయడంతో పాటు గ్రంథాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు, సిబ్బందికి కూడా కంప్యూటర్ శిక్షణ ఇప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల్లో 42 గ్రంథాలయాలకు స్వంత భవనాలు ఉండగా, 4 అద్దె భవనాలు, 6 అద్దెలేని భవనాల్లో గ్రంథాలయాలు కొనసాగుతున్నాయి. గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ అందుబాటులో ఉన్న వారితో గ్రంథాలయాలు కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నాం. మొత్తం 88 ఉద్యోగాల్లో ప్రస్తుతం 57 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న వాటిల్లో గ్రేడ్-2 గ్రంథ పాలకుల్లో 4 పోస్టులకు 4 ఖాళీగా ఉన్నాయి. 30 గ్రేడ్- 3 గ్రంథ పాలకుల పోస్టుల్లో ప్రస్తుతం 7గురు పనిచేస్తుండగా, మిగతా 23 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 30 వరకు జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, వాచ్‌మెన్, అటెండర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. గ్రంథాలయాలను పాఠకులకు అందుబాటులో ఉంచేందుకు రికార్డ్ అసిస్టెంట్లు, పార్ట్‌టైమ్ వర్కర్లు, వాచ్‌మెన్‌ల సేవలను వినియోగించుకుంటున్నాం. గ్రంథాలయాల్లో 15 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కేంద్ర గ్రంథాలయంతో పాటు 52 శాఖా గ్రంథాలయాలు, 12 గ్రామ గ్రంథాలయాలు, 166 పుస్తక నిక్షేప కేంద్రాలు, 2 ఎయిడెడ్ గ్రంథాలయాలు ఉండగా, ఇటీవల గ్రంథాలయాల విభజన చేపట్టారు. రంగారెడ్డి జిల్లాతో పాటు కొత్తగా ఏర్పాటైన మేడ్చల్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. అప్పట్లో వికారాబాద్ కేంద్రంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఏర్పాటు కావడంతో ఆ రెండు జిల్లాల్లో కొత్త గ్రంథాలయ సంస్థలు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లాల్లో కలిపి మొత్తం 8,26,505 పుస్తకాలు ఉండగా, వాటిలో తెలుగు 6,75,012, ఇంగ్లిష్ 87,013, హిందీ 37,317, ఉర్దూ 25,158, సంస్కృతం 1,320 పుస్తకాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని గ్రంథాలయాల్లో 79,483 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. విజ్ఞానం పంచే జిల్లా గ్రంథాలయాలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలి. పాఠకుల కోసం గ్రంథాలయాల్లో వేలాది పుస్తకాలు అందుబాటులో ఉంచడం జరిగింది. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ తదితర భాషల్లో పుస్తకాలు ఉన్నాయి. ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను గత ఏడాది రెండు లక్షలతో కొనుగోలు చేశాం. కొత్తగా కొనుగోలు చేసిన పోటీ పరీక్షల పుస్తకాల్లో చాలావరకు తెలంగాణకు సంబంధించినవే ఉన్నాయి. పోటీ పరీక్షలకు సంబంధించి నిరుద్యోగ యువత, విద్యార్థుల నుంచి ఆన్ డిమాండ్ పుస్తకాల వివరాలు సేకరిస్తున్నాం. త్వరలో వారు కోరుకుంటున్న కొత్త పుస్తకాల జాబితా రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తాం. ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే కొత్త పోటీ పుస్తకాలు కొనుగోలు చేస్తాం.

ఆదర్శంగా నిలిచిన 'ఓం ప్రగతి మ్యాక్స్'

● ఆర్థిక అవసరాలకు అండ..

సామాజిక సేవల్లో ముందు

మహిళ

ఇబ్రహీంపట్నం: మహిళలు సంఘాలుగా ఏర్పడి పొదుపుతో పాటు రుణాలు పొందుతూ, వ్యవసాయంలో పెట్టుబడులు, వివిధ రకాల వ్యాపారాలు చేస్తూ ఆర్థికావసరాలు తీర్చుకుంటూ, తమదైన శైలిలో రాణించేందుకు కృషి చేస్తున్నారు. దీనికి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని 'ఓం ప్రగతి మ్యాక్స్' పరస్పర సహకార పొదుపు, పరపతి సంఘాల సమాఖ్యే నిదర్శనం. ఇది ఇబ్రహీంపట్నం కేంద్రంగా మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, కందుకూరు, మహేశ్వరం మండలాల్లో తన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. మొత్తం 57 సంఘాలతో 16,151 మంది సభ్యులతో అతి పెద్ద సమాఖ్యగా ఇది ముందుకు పోతోంది. ఈ మ్యాక్స్‌లో మహిళా సంఘాలు 48 కాగా, మూడు పురుష సంఘాలు, సహవాసుల సంఘాలు ఆరున్నాయి. మొత్తం సంఘాల టర్నోవర్ సుమారు రూ.25 కోట్లు ఉంది. ఓం ప్రగతి ప్రధాన కార్యాలయం టర్నోవర్ 2.50 కోట్లుగా ఉంది. పై సంఘాలన్నీ ఓం ప్రగతి మ్యాక్స్ పరిధిలోనే పనిచేస్తాయి. ఒక్కో సంఘంలో 100 నుంచి 1400 మంది సభ్యులుండగా తీసుకున్న అప్పులను సకాలంలో చెల్లిస్తూ దీనిని విజయవంతంగా ముందుకు తీసుకుపోతున్నారంటే నిజంగా అతిశయోక్తే. ఈ రుణాలను వ్యవసాయంలో పెట్టుబడులు, పాడిగేదెలు, గొర్రెల కొనుగోళ్లు, ఇతర చిన్న చిన్న వ్యాపారాలైన కిరాణా, టెంట్‌హౌజ్, కూరగాయలు, పాల వ్యాపారం లాంటివి నిర్వహించడమే గాక పిల్లల ఉన్నత చదువులకోసం, ఆరోగ్య అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ప్రతి నెలా సంఘాలు సమావేశమై ఆదాయ, వ్యయాలపై చర్చించి ప్రధాన కార్యాలయానికి నివేదిక పంపుతుంటారు. కాగా సంఘాల్లో సభ్యులు చేసే పొదుపుపై 6 శాతం వడ్డీ ఇస్తున్నారు. అప్పులపై 12 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో సభ్యురాలికి గరిష్టంగా రెండు లక్షల రూపాయల వరకు అప్పుగా ఇస్తున్నారు. ఐదేళ్ల అనతి కాలంలోనే దీనిని ఇంతగా అభివృద్ధి చేసుకున్నారంటే సంఘ సభ్యుల్లో ఉన్న పట్టుదలే కారణంగా చెప్పవచ్చు. ప్రతి సంఘం ఏడాదికోమారు వార్షిక సమావేశంలో నూతన పాలక వర్గాన్ని ఎన్నుకుంటుంది. సంఘాల నుంచి ఎన్నికైన పాలక వర్గ సభ్యుల్లోంచి ఓం ప్రగతి మ్యాక్స్ కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. మ్యాక్స్‌లో అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారితోపాటు 5 మంది కార్యవర్గ సభ్యులుంటారు. వీరుగాక మ్యాక్స్ సీఈవో, అక్కౌంటెంట్ సహా 13 మంది కార్యాలయ సిబ్బంది ఉన్నారు. ఇటీవలే ప్రదాన కార్యాలయం నూతన భవనం కూడా నిర్మించుకున్నారు.



సంఘ సమావేశంలో చర్చిస్తున్న సభ్యులు

సామాజిక కార్యక్రమాల్లో..

సంఘ సభ్యుల్లో ఎవరైనా అకాల మరణానికి గురైతే వారి కుటుంబానికి తక్షణ సాయంగా 5 వేల రూపాయల వరకు అందజేస్తారు. దీనిని విపత్తు సాయం అని చెప్తున్నారు. ఐదేళ్ల కాలంలో 150 మందికి 21 లక్షలు దీని కింద అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళలకు క్రీడోత్సవాలు నిర్వహిస్తూ అంతా కలిసి ఆడి పాడుతారు. ఇది ఓరకంగా గ్రామీణ మహిళల్లో ఉన్న ఆత్మ న్యూనతా భావాన్ని పోగొట్టి చైతన్యవంతులను చేయడమేనని చెప్పవచ్చు. అంతేగాదు సంఘ సభ్యుల్లో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై తమ వంతు బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారూ ఉన్నారు.



ఇబ్రహీంపట్నంలోని ఓం ప్రగతి మ్యాక్స్ ప్రధాన కార్యాలయం

నమ్మకమే పెట్టుబడిగా..



గ్రామాల్లోనేగాక టౌన్‌లో కూడా ఇంతగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నామంటే నమ్మకమనే చెప్పవచ్చు. ప్రతి సభ్యురాలు బాధ్యతతో ఉంటుంది. ఏదైనా అవసరం వచ్చిందంటే బయట ఎక్కడో అప్పుకు పోకుండా సంఘం ఉందిలే అనే భరోసా ఉంటుంది. ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా ఐదేళ్ల కాలంలోనే ఇంతగా ఎదిగిందంటే గర్వంగా చెప్పుకుంటాం.

-టి.సంగీత, సీఈవో

కలిసి కట్టుగా సంఘాలు..



ఇది ఓరకంగా సంఘ సభ్యుల్లో ఐక్యతను పెంచడమే గాక ప్రతి సమావేశంలో పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు. కేవలం పొదుపు, అప్పుల వ్యవహారమనేకాదు. ఏదైనా ఆపద సమయంలో మేమున్నాం.. అనే దీమా కనిపిస్తుంది. ఎవరికి వారు వ్యాపారాలు కూడా చక్కగా చేసుకుంటున్నారు.

-డి.వెంకటేష్, అక్కౌంటెంట్

బయట అప్పులకు పోకుండా..



సంఘాలతోనే సభ్యులకు గౌరవం, నమ్మకం పెరిగాయి. స్కూళ్లు, కళాశాలలు తెరిచారంటే పిల్లలకు ఫీజులు, దుస్తులు ఇతరత్రా ఎట్లా అని దిగులుండేది. పంటలు సాగు చేసే సీజన్ వచ్చిందంటే పెట్టుబడులకోసం ఇబ్బందులు పడే వాళ్లం. ఇప్పుడు అలాకాదు సంఘం ఉందిలే అని నమ్మకం.

-ఇక్క శాంత, సంఘ సభ్యురాలు, గున్‌గల్

కోర్కెలు తీర్చే శ్రీరామభక్త హనుమంతుడు

శామీర్‌పేట రూరల్: భక్తుల కోర్కెలు తీరుస్తూ కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ హనుమాన్ ఆలయం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం పోతాయపల్లి గ్రామ సమీపంలో వెలసియున్నది. ఈ ఆలయాన్ని అతి పురాతనమైన పెద్ద మర్రి వృక్షం క్రింద నిర్మించారు. ఈ ఆలయం పక్కనే శ్రీరామభద్రక్షేత్రం నూతనంగా ప్రతిష్ఠించారు. అందుకే ఈ హనుమాన్ ఆలయానికి క్షేత్రపాలకుడుగా విరాజిల్లుతున్నాడు. ఈ ఆలయాన్ని ఎన్నో సంవత్సరాల కింద ప్రతిష్ఠించారు. శ్రీ శంకర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) ఆలయ సేవకులు పండరి సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో సంస్కృత సోదరులు శ్రీనాధ్‌శర్మ, మహదేవశర్మ, అష్టకాల అనంత క్రిష్ణశర్మ సహకారంతో పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, కలాన్యాసం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నదానం నిర్వహిస్తామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. ఈ ఆలయానికి హైదరాబాద్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు.



నూతనంగా ప్రతిష్ఠించనున్న హనుమాన్ ఆలయం

మండలానికో సర్వేయర్‌ను నియమించాలి

● అనంతరెడ్డి, అధ్యక్షుడు, టీఎన్‌జీవో, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్, మేడ్చల్ జిల్లా



కీసర రూరల్ : ప్రతి మండలానికొక రెవెన్యూ సర్వేయర్‌ను నియమించాలి. రెండు మూడు మండలాలకు కలిపి ఒక సర్వేయర్ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సర్వేయర్‌పై పని భారం పెరుగుతుంది. ప్రజల నుంచి, అధికారుల నుంచి ఒత్తిడికి గురై అనారోగ్యానికి గురవుతున్నారు. ఏ మండలంలో పూర్తి స్థాయిలో విధులు నిర్వర్తించలేక పోతున్నాము. ప్రతి చిన్న పొరపాటుకు సర్వేయర్‌ను బాధ్యుడ్ని చేస్తుండటంతో విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల స్థాయిలో పనిచేసే వీఆర్వో, ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్‌లకు 42 రోజుల పాటు సర్వేపై అవగాహన కల్పించిన అనంతరం నియామకాలు చేపట్టడం జరుగుతుంది. సర్వేకు సంబంధించిన అంశాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయకుండా రిపోర్టు చేయటంతో సర్వేయర్‌ను బాధ్యుడిని చేయండంతో ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడుతుంది. సమస్యల పరిష్కారానికి ఖాళీగా ఉన్న సర్వేయర్ల పోస్టులన్నీ భర్తీ చేయాలి. రెండు, మూడు మండలాల్లో విధులు నిర్వహిస్తున్న సర్వేయర్లకు అదనంగా రవాణా భత్యం చెల్లించాలి. సర్వేయర్‌ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి.

అక్రమార్కుల్లో అలజడి..

- ఎక్మాయి నాపరాళ్ల గనుల్లో అక్రమార్కుల గుట్టురట్టు...
- 27 యంత్రాలు సీజ్ చేసిన అధికారులు
- ఎక్కడికక్కడే నిలిచిపోయిన తవ్వకాలు
- మిగతా గని ప్రాంతాల్లో జాగ్రత్తపడుతున్న అక్రమార్కులు

బషీరాబాద్ : అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. తాండూరు సబ్ కలెక్టర్ సందీప్‌కుమార్ అక్రమ మైనింగ్‌పై శుక్రవారం కొరడా ఝుళిపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నాపరాళ్ల గనిలో ఉన్న అక్రమార్కులకు చెందిన కటింగ్ మిషన్లను సీజ్ చేసి తరలించాలని ఆదేశించారు. దీంతో రెండో రోజైన శనివారం ఎక్మాయి శివారు గట్టుపై తహసీల్దార్ వెంకటయ్య, ఎస్ఐ షర్ఫొద్దీన్‌ల ఆధ్వర్యంలో నాపరాళ్ల గనుల నుంచి కట్టింగ్ మిషన్లను క్రేన్ సహాయంతో ట్రాక్టర్‌లో ఎక్కించి బషీరాబాద్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఒక్కో కట్టింగ్ మిషన్ ధర రూ.లక్ష వరకు ఉండగా 27 మంది అక్రమార్కుల కట్టింగ్ మిషన్ల సామాగ్రిని ట్రాక్టర్‌లో ఎక్కించారు. కొన్నేళ్లుగా ప్రభుత్వ భూమిలో లీజులు, అనుమతులు తీసుకోకుండా, రాయల్టీ చెల్లించకుండా అక్రమార్కులు నాపరాళ్లను తరలించుకుపోతున్నట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. అక్రమ మైనింగ్ వ్యవహారంలో ఎవరెవరు ఏ మేరకు తవ్వకాలు జరిపి నాపరాళ్లు తరలించారనేది మరోసారి సాంకేతిక నిపుణుల బృందంతో విచారణ చేయించి, సబ్ కలెక్టర్ ఆదేశానుసారం అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెంకటయ్య తెలిపారు.

అక్రమార్కులు పారా హుషార్...

బషీరాబాద్ మండలంలో క్యాద్గీర, నావల్గ, కొర్విచెడ్, మాసన్‌పల్లి తదితర గ్రామాల శివారులో నాపరాళ్ల నిక్షేపాలున్నాయి. ఈ ప్రాంతంలో ఎక్కువగా ప్రభుత్వానికి చెందిన పలు సర్వేనెంబర్లలో గని భూములున్నాయి. ఇక్కడ కొన్నేళ్లుగా నాపరాళ్ల దోపిడీ జరుగుతుంది. కాగా, ఎక్మాయి శివారు గట్టుపై సబ్ కలెక్టర్ అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించడం పత్రికల్లో చదివిన మరి కొందరు అక్రమార్కుల్లో దాడుల భయం పట్టుకుంది. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లోంచి గనుల్లో ఉన్న నాపరాళ్ల కట్టింగ్ మిషన్‌లను కొందరు అక్రమార్కులు ముందస్తుగా ఇళ్లకు తరలించారు. శనివారం ఆయా గ్రామాల గనుల పరిసర ప్రాంతాల్లోంచి కట్టింగ్ మిషన్లను, సామాగ్రిని, ట్రాక్టర్‌లో తరలిస్తూ కనిపించారు.



క్యాద్గీర నాపరాళ్ల గనుల నుంచి ముందస్తు జాగ్రత్తగా కట్టింగ్ మిషన్‌లను తీసుకెళుతున్న అక్రమార్కులు

లీజు, రాయల్టీ చెల్లించని వారెందరో...

ఓ పక్క ప్రభుత్వ భూమిలో నాపరాళ్లను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులపై కొరడా ఝుళిపిస్తున్న సబ్ కలెక్టర్ ఇంకా ఎక్కడెక్కడ నాపరాతి నిక్షేపాలు కొల్లగొడుతున్నారనే దానిపై ఆరాతీసే పనిలో ఉన్నట్లు సమాచారం. ఒక దగ్గర లీజు తీసుకుని మరో దగ్గర తవ్వకాలు జరుపుతున్నట్లు తేలగా, రాయల్టీ చెల్లించకుండా పెద్దఎత్తున నాపరాళ్ల సంపదను దోపిడీ చేస్తున్నట్లు రెవెన్యూ అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. నాపరాళ్ల వ్యాపారంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు స్థానిక నాయకులు ఉన్నట్లు సబ్ కలెక్టర్ దృష్టికి రెవెన్యూ అధికారులు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. లీజులు లేకుండా రాయల్టీ చెల్లించకుండానే నాపరాళ్లను కొందరు తరలించుకుపోయినట్లు రెవెన్యూ అధికారుల విచారణలో తేలడంపై సబ్ కలెక్టర్ దృష్టికి శనివారం తీసుకెళ్లినట్లు తెలిసింది. ఏదేమైనా శనివారం క్యాద్గీర, నావల్గ, మాసన్‌పల్లి, కొర్విచెడ్ తదితర నాపరాళ్ల గనులు మూతబడ్డాయి.



కోనేరు మధ్యలో వెలసిన ఏకాంబర రామలింగేశ్వరాలయం

నేటి నుంచి ఏకాంబర రామలింగేశ్వరుని జాతర

బషీరాబాద్ : శ్రావణ మాసంలో ప్రజలకు ముందుగా గుర్తుకు వచ్చేది నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరాలయం జాతర. ఈ ఆలయం బషీరాబాద్ మండలం నీళ్లపల్లి అటవీ ప్రాంతంలోని కొండకోనల్లో చక్కటి శిల్పకళా సంపదతో వెలసిన శ్రీఏకాంబర రామలింగేశ్వరాలయంలో నేటి(ఆదివారం) నుంచి జాతర ప్రారంభం కానుంది. ప్రతి సంవత్సరం శ్రావణమాసం చివరి సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. జాతరలో భాగంగా 20వ తేదీన పల్లకిసేవా, గంధం కార్యక్రమం, 21న సాయంత్రం 4 గంటలకు రథోత్సవం, జాతర ఉత్సావాలు, 22న రాత్రి 12గంటలకు లంకాదహనం, 23న జాతర ముగింపు కార్యక్రామాలు జరుగుగుతాయి. జాతరలో సర్వమత సమ్మేళనానికి ప్రతీకగా హిందువులు, ముస్లింలు, ఇతర మతస్తులు పాల్గొనడం విశేషం. జిల్లాలోని బషీరాబాద్, తాండూరు, యాలాల, పెద్దెముల్, వికారాబాద్, శంకర్‌పల్లి, మోమిన్‌పేట్ పరిగి, ప్రాంతల నుంచికాక మహబుబ్‌నగర్, కొడంగల్, కోస్గి, నారయణ్‌పేట్, కర్ణాటకలోని ముదేళ్లి, ఆడ్కి,సేడం తదితర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తారని ఆలయ కమిటీ చైర్మన్ నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆచారి నర్సింహులు తెలిపారు.

జాతర ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు...

ఏకాంబర రామలింగేశ్వర ఆలయం జాతర ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తాండూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. భక్తుల సౌకర్యార్థం నాలుగు రోజుల పాటు బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు ఆయన తెలిపారు.

శాస్త్రవేత్తలను తయారుచేయడమే 'అన్వేషిక' లక్ష్యం

జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్



మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్

తాండూరు : శాస్త్రవేత్తలను తయారు చేయడమే 'అన్వేషిక' లక్ష్యమని జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్ అన్నారు. శనివారం తాండూరు ప్రభుత్వ నెంబర్-1 పాఠశాలలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలోచనాత్మక ప్రశ్నలు మనస్సులో మెదిలే విధంగా విద్యార్థులు తయారు కావాలన్నారు. తాండూరు మండల విద్యాధికారి వెంకటయ్య మాట్లాడుతూ ప్రతి ఆచారం వెనుక ఒక శాస్త్రీయత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంధానకర్త కె.వాసుదేవ్, సమన్వయకర్తలు కమాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఆనంద్, శ్రీధర్, సంధారాణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పది పాఠశాలలు, ఆరు కళాశాలల నుంచి 65 మంది విద్యార్థులు స్క్రీనింగ్ టెస్ట్‌లో పాల్గొన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి రాష్ట్రస్థాయిలో ప్రయోగ పరీక్ష నిర్వహించి తదుపరి జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

బొంరాస్‌పేట్ : సిమెంట్ ట్యాంకర్, క్రైలో వాహనం ఢీకొని నలుగురికి గాయాలైన సంఘటన బొంరాస్‌పేట్ మండలంలో జరిగింది. శనివారం ఉదయం బొంరాస్‌పేట్ పరిధిలోని మెట్లకుంట గ్రామ పంచాయతీ పూల్యానాయక్ తండా సమీపంలో యాద్గీర్, హైదరాబాద్ అంతర్‌రాష్ట్ర రహదారిపై కొడంగల్ నుంచి వస్తున్న క్రైు(కేఏ 32 యం 8643)లో వాహనం ఎదురుగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్(ఏపీ 28 టీఏ 7473)ను ఢీకొట్టింది. క్రైలో వాహనంలో గుల్బర్గకు చెందిన 8 మంది ప్రయాణిస్తున్నారు. అందులో విశ్వనాథంకు చేతులు విరగగా, శాంతబాయి, నర్సప్పకు నడుములు విరిగాయి. వీరితో పాటు వినయ్‌కుమార్, యామినిలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ఎస్సై వెంకటేశ్వర్లు పరిగి ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

రుబెల్లాతో ఐదుగురు విద్యార్థులకు అస్వస్థత

చికిత్స నిమిత్తం చిన్నారులను ఆస్పత్రికి తరలింపు

నేతాజీ గురుకుల పాఠశాలలో ఘటన

తాండూరు : మీజిల్స్, రుబెల్లా నివారణ టీకా మందుతో ఐదు మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డు మార్గంలోని నేతాజీ గురుకుల పాఠశాలలో శనివారం వైద్య సిబ్బంది రుబెల్లా టీకాలు వేయగా ఐదుగురు విద్యార్థులు టీకాలు తీసిన వెంటనే శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడ్డారు. చిన్నారులకు బీపీపెరగడంతో పాఠశాల సిబ్బంది కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి అనంతరం ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. అస్వస్థతకుగురైన వారిలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజుగౌడ్ కూతురు గౌరితో పాటు ప్రముఖ వ్యాపారుల పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం వీరంతా కోలుకుంటున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. చిన్నారులకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. ఏదైనా ఒక బాక్సుకు సంబంధించి టీకాలు వేయడంలో డోసు పెంచితే ఇలాంటి సంఘటనలు జరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఈ సంఘటనతో శనివారం పాఠశాలకు సెలవు ప్రకటించారు. పాఠశాలను ఎంఈవో వెంకటయ్య సందర్శించారు. మొత్తం పాఠశాలలో 285 మంది విద్యార్థులకు రుబెల్లా టీకాలు వేయగా ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.

వికారాబాద్‌లో మోస్తరు నుంచి భారీ వర్షం

వికారాబాద్ రూరల్ : వికారాబాద్‌లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వర్షం శనివారం రాత్రి వరకు కొనసాగింది. జిల్లా కేంద్రంలో ఎక్కడ చూసిన వర్షం నీరుతో రోడ్లన్ని చిత్తడిగా మారాయి.

వర్షంలో కొనసాగిన లగోరి క్రీడలు...

అనంతగిరి : వికారాబాద్‌లో శనివారం ప్రారంభమైన జాతీయ స్థాయి జూనియర్ లగోరి క్రీడలకు వర్షం అడ్డంకిగా మారింది. ఉదయం నుంచి వర్షంలోనే పోటీలు కొనసాగాయి. ఆదివారం కూడా కురిసే అవకాశం ఉన్నందున క్రీడలు వర్షంలోనే ముగిసే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ వెంకట్‌రెడ్డి

ఇంటర్ స్థాయిలో కష్టపడితేనే భవిష్యత్తు

సరస్వతి జూనియర్ కళాశాల చైర్మన్ వెంకట్‌రెడ్డి

అనంతగిరి : ఇంటర్ స్థాయిలో కష్టపడితేనే భవిషత్తు ఉంటుందని సరస్వతి జూనియర్ కళాశాల చైర్మన్ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని గౌలికార్ ఫంక్షన్ హాల్‌లో కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవితంలో విద్యార్థి దశ అనేది ముఖ్యమైందన్నారు. ఈ దశలో కష్టపడితే భవిషత్తులో సుఖపడతారని చెప్పారు. ప్రతి విద్యార్థి ఒక మంచి లక్ష్యాన్ని ఎంచుకుని సాధించుకునేందుకు ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జబర్దస్త్ ఫేం శ్రీను అందరిని అలరించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బస్వరాజ్, విశ్వభారతీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, కళాశాల డైరెక్టర్లు భాను ప్రకాష్ రెడ్డి, జహిరుద్దీన్, వెంకటరమణ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తుంది

టీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య

అనంతగిరి : ప్రభుత్వం మండల స్థాయి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తుందని టీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణయ్య అన్నారు. శనివారం మండల స్థాయి ఉద్యోగులు డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మెకు కృష్ణయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఇప్పటికే కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేసిందన్నారు. మండల స్థాయిలో అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్లుగా పనిచేస్తున్న వారికి కనీస వేతనం అమలు చేసేందుకు కృషిచేస్తోందన్నారు. ఉద్యోగుల సమస్యలను పార్టీ తరుపున ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. కనీస వేతనం రూ.18,500 ఇస్తుందన్న నమ్మకం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

'సెప్టెంబర్ 1న సెలవు ప్రకటించాలి'

దోమ: సీపీఎస్ విధానం రద్దుకోసం సెప్టెంబరు ఒకటిన ఉపాధ్యాయులందరికి సెలవు ప్రకటించాలని ఉపాధ్యాయులు నర్సింహులు, రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మోత్కూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ, సెప్టెంబరు 1న ఉపాధ్యాయులందరికి సామూహిక సెలవు ప్రకటించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. 2004 నుంచి సీపీఎస్ విధానం ప్రవేశ పెట్టడంతో రాష్ట్రంలో లక్షా 20,571 ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలకు సామూహిక భద్రత లోపించిందన్నారు. సీఎం నూతన పింఛన్ విధానంను రద్దు చేసి 1280 పెన్షన్ రూల్స్ అందరికి వర్తింపచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ



24 గంటల విద్యుత్ సరఫరాకు చర్యలు

రాంబాబు, పరిగి ఏడీఈ

పరిగి: రబీ సీజన్‌కు(డిసెంబర్) నుంచి ఇరవైనాల్గు గంటల విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని పరిగి ఏడీఈ రాంబాబు తెలిపారు.

ప్ర: ఇరవైనాలుగు గంటల విద్యుత్‌కు చర్యలేమిటి..?

జ: విద్యుత్ అవసరాలకనుగుణంగా ఉత్పత్తి కూడా పెరిగింది. వచ్చే రబీకి 24 గంటలు ఇచ్చేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించారు.

ప్ర: విద్యుత్ ప్రమాద బాధితకుటుంబాలకు మీరిచ్చే సహాయం ఏమిటి.?

జ: విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన కుటుంబానికి రూ.4 లక్షలు, పశువులు చనిపోతే రూ.40 వేల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నాం. ఇందుకు సంబంధించి ఎఫ్ఐఆర్, పీఎం రిపోర్టు సమర్పించాల్సి ఉంటుంది.

ప్ర: మీ పరిధిలో ఎన్ని విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి.?

జ: పరిగి, దోమ, కులకచర్ల మండలాల పరిధిలో 12 వేల వ్యవసాయ, దాదాపుగా 33 వేలకుపైగా ఇళ్లవి, ఐదు వందల వరకు చిన్న, పెద్ద పరిశ్రమల కనెక్షన్లు, ఐదువేలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటాయి.

ప్రయాణికులకు నీడ కరువు.!

బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల ఇబ్బందులు

సిటిజన్ రిపోర్టర్



సురేందర్‌గౌడ్

కులకచర్ల: మండల పరిధిలోని ఆయా గ్రామాల బస్ స్టేజీల దగ్గర షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఏళ్ల గడిచిన బస్ షెల్టర్ల ఏర్పాటు విషయం అడిగేవారు కరువయ్యారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా, కొత్త రాష్ట్రం ఏర్పడిన, జిల్లాలోనే రవాణా శాఖ మంత్రి ఉన్నా బస్ షెల్టర్ల విషయంలో ఆయా గ్రామాల ప్రజల తలరాతలు మారడం లేదు. దీంతో ఆయా గ్రామాలలోని బస్ స్టేజీల వద్ద బస్ షెల్టర్లు లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రయాణికులు పడే అవస్థలు అన్నీఇన్నీ కావు. మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీలలో 17 గ్రామాల బస్ స్టేజీల దగ్గర బస్ షెల్టర్లు లేవు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్లాలంటే బస్ స్టేజీల దగ్గర చెట్ల కింద, ఇతరుల ఇళ్ల దగ్గర నిల్చుంటున్నారు. బస్సులు రాగానే పరిగెత్తుకుంటూ రావడమే. బస్ డ్రైవర్ల దయాదాక్షిణ్యంతో కాసేపు ఆపితే వారు బస్సు ఎక్కాలి లేకుంటే అంతే సంగతులు. బస్ స్టేజీల దగ్గర షెల్టర్లు లేని కారణంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని అంతారం, ఘనాపూర్ స్టేజీ, పుట్టపహాడ్, పీరంపల్లి, కామునిపల్లి, ముజాహిత్‌పూర్ గేట్, ఇప్పాయిపల్లి గేట్, గండిచెరువు, చౌడాపూర్, మక్తవెంకటాపూర్, అడవి వెంకటాపూర్, లింగంపల్లి, సాల్వీడ్ గ్రామాల బస్ స్టేజీల దగ్గర షెల్టర్లు లేవు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి జిల్లా వాసి కాబట్టి ఆయా గ్రామాల స్టేజీల దగ్గర బస్ షెల్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అంతారం స్టేజి వద్ద బస్ కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

పింఛన్ల పంపిణీపై అధికారిణి ఆరా..

కులకచర్ల: మహబూబ్‌నగర్ జిల్లాలో విలీనమైన గ్రామాలలో పింఛన్ల పంపిణీ విధానంపై ఆ జిల్లా డీఆర్‌డీఏ జిల్లా అధికారిణి శారద వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలో నుంచి మరికల్, కల్మన్‌కాల్వ, చాకల్‌పల్లి గ్రామ పంచాయతీలు జిల్లాల పునర్విభజనలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా నవాపేట్‌లో విలీనమయ్యాయి. ఈ గ్రామాలలో పింఛన్ల పంపిణీకి డబ్బులు వికారాబాద్ జిల్లా నుంచే వెళ్తున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు కొత్త పింఛన్ల కోసం ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకున్నారు. శనివారం ఎంపీడీవో సురేష్‌బాబును కలిసిన జిల్లా అధికారిణి శారద వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్తగా దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి ఎంపిక చేయడం జరిగిందని, వీరికి పంపిణీ చేయించాలని తెలిపారు. జిల్లా మారిన పింఛన్ల ఇక్కడి నుంచే కొనసాగుతున్నాయని తెలిపారు. ఇక్కడి అధికారులు కూడా పింఛన్ల పంపిణీపై పర్యవేక్షించాలని తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



విద్యార్థులకు టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కులకచర్ల: వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా పిల్లలకు వేయించాలని సీహెచ్‌వో చంద్రకాంత్ తెలిపారు. రుబెల్లా వ్యాక్సిన్లు వేసే కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో, సాల్వీడ్ ఉన్నత , చెల్లాపూర్, ఘనాపూర్ పాఠశాలలో విద్యార్థులకు టీకాలు వేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ ముట్టడి టీఎంటీయూ మద్దతు

పరిగి: ఎస్సీ, ఎస్టీ సంఘాలు చేపట్టిన డీఎస్సీ ముట్టడి కార్యక్రమానికి టీఎంటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలంగాణ మాదిగ ఉపాధ్యాయ సంఘం పరిగి తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకటయ్య, బి.బిచ్చన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా ఉన్న జీవోనం.342 ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు సర్వీసులో ఉంటూ ఉన్నత విద్య చదివే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని జీవో నం.26559 అడ్డుపడుతుందని తెలిపారు. 21న సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ముట్టడి కార్యక్రమానికి ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె

నాల్గోరోజుకు చేరిన సమ్మె

పింఛన్ లబ్ధిదారులు ఎదురుచూపులు

కులకచర్ల: గ్రామీణ తపాల ఉద్యోగులు సమ్మెబాట పట్టడంతో పింఛన్ లబ్ధిదారులు పింఛన్ డబ్బుల కోసం తపాలా కార్యాలయం ముందు పడిగాపులు కాస్తున్నారు. గ్రామీణ తపాల ఉద్యోగులు చేస్తున్న సమ్మె శనివారంకు నాల్గో రోజుకు చేరింది. స్థానిక తపాల కార్యాలయం ముందు ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. కులకచర్ల నుంచి కుస్మసముద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. తమ డిమాండ్లు సాధించే వరకు సమ్మెబాట విరమించేది లేదని, ఆల్ ఇండియా తపాల ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు వేణు తెలిపారు. కార్యక్రమంలో తపాల ఉద్యోగులు చంద్రమౌళి, గోపాల్, అశోక్, బాల్‌రెడ్డి, విశ్వనాథం పాల్గొన్నారు.



తపాల కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

తపాల ఉద్యోగులు సమ్మె చేపడుతుండగా పింఛన్ కోసం వృద్ధులు కార్యాలయంకు వచ్చి కార్యాలయం ముందు భైఠాయించారు. సమ్మె ఎప్పుడు ముగుస్తుంది. తమకు పింఛన్ డబ్బులు ఎప్పుడు పంపిణీ చేస్తారని వారు అడిగారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కూర్చొని లబ్ధిదారులు వెళ్లిపోయారు.

'పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి'



దోమల మందును స్ప్రే చేయిస్తున్న సర్పంచ్

పరిగి: పట్టణ ప్రజలు ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పరిగి సర్పంచ్ విజయమాల అన్నారు. దోమల నివారణలో భాగంగా శనివారం పరిగి పట్టణంలో మురికికాలువలు, గుంతల ప్రాంతాల్లో స్ప్రేమందును పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పట్టణంలో అన్ని కాలనీల్లో ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ 63వ జన్మదిన ఉత్సవాలను శనివారం మండల పరిధిలోని మందిపాల్ గ్రామంలో నిర్వహించారు. గ్రామ ముదిరాజ్ యువజన సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ జడ్పీచైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ 63వ వేడుకలను శనివారం పరిగిలో ముదిరాజ్ యువసేన ఆధ్వర్యంలో జరుపుకున్నారు. పరిగి సివిల్ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు అనిల్, నవీన్, రమేష్, శ్రీనివాస్, పెంటయ్య పాల్గొన్నారు. **- కులకచర్ల, పరిగి**



'సీపీఎస్ రద్దు శంఖారావాన్ని విజయవంతం చేయాలి'

పరిగి: సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ, ఆదివారం శంషాబాద్‌లో చేపడుతున్న శంఖారావాన్ని విజయవంతం చేయాలని టీసీపీఎస్ఈఏ నాయకులు కోరారు. శనివారం పరిగిలోని ఎమ్మార్సీ వద్ద వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎంఈవో అంజిలయ్య, సత్యనారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి, వీరేశం, ఎస్.రాజు, లక్ష్మణ్‌నాయక్, పాండురంగాచారి, శంకర్‌రావు, ఉస్మాన్‌అలీ పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ దినోత్సవం..

కులకచర్ల: డిజిటల్ యుగంలో గ్రామీణ ప్రాంత ఫొటోగ్రాఫర్లకు ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని కులకచర్ల, గండీడ్, దోమ ఫొటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ వారు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. స్థానికంగా ఉంటున్న అనాథలైన శంకర్ కుటుంబానికి బట్టలు, పండ్లు పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. ఒకప్పుడు ఫొటోగ్రఫీ అంటే ఎంతో విలువలతో కూడి ఉండేదని, నేడు డిజిటల్ యుగం, సెల్‌ఫోన్లు రావడంతో ఫొటోగ్రాఫర్ల ప్రమాణాలు తగ్గాయన్నారు. ప్రభుత్వం కూడా ఫొటో గ్రాఫర్లకు అధునాతన సాంకేతికతంతో కూడిన యంత్రాలను అందజేసేందుకు రుణ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్స్ నాయకులు నర్సింహులు, షైపాల్, శ్రీనివాస్, గంగాధర్, ఆయా గ్రామాల ఫొటో గ్రాఫర్లు పాల్గొన్నారు.



అనాథలకు దుస్తుల పంపిణీ చేస్తున్న ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు

23 నుంచి జోనల్‌స్థాయి

ఖో-ఖో పోటీలు

దోమ: ఈ నెల 23న దిర్సంపల్లి ఉన్నత పాఠశాల ఆవరణంలో జోనల్ స్థాయి ఖో-ఖో టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, జోనల్ సెక్రెటరి ఎండి.ఖాజాలు అన్నారు. శనివారం వారు దిర్సంపల్లి ఉన్నత పాఠశాలలో జోనల్ స్థాయి ఖో-ఖో పోటీలు నిర్వహించేందుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ ఖో-ఖో జోనల్ స్థాయి టోర్నమెంట్‌లో క్రీడలతో పాటు సెలక్షన్, క్రీడలలో ప్రతిభ కనభరిచిన విద్యార్థులను జోనల్ స్థాయిలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

ఈ జోనల్ స్థాయి ఖో-ఖో పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బాలికలకు, బాలురకు అవకాశం ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి ఈ క్రీడలు ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సత్యయ్యగౌడ్, పాఠశాలల చైర్మన్‌లు రవి, కొండారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎట్టకేలకు ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలకు స్థలాన్ని పరిశీలించారు. వారం రోజుల క్రితం సబ్ కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా బురాన్‌పూర్‌లో పర్యటించి అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో శనివారం రెవెన్యూ అధికారులు భూమి సర్వే నిర్వహించారు. మండల సర్వేయర్ మల్లేశం బురాన్‌పూర్ పరిధిలోని సర్వే నెంబర్ 254లో పాఠశాల కోసం సర్వే చేసి హద్దులు గుర్తించారు. ఈ సర్వేలో పరిసర రైతులు పాల్గొన్నారు. **- బొంరాస్‌పేట్**

శ్రావణమాసం ముగింపు.. ప్రత్యేక పూజలు



అంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొడంగల్: నెల రోజుల పాటు నియమ, నిష్టలతో శ్రావణమాసం ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రావణమాసం ముగింపు శనివారంను పురస్కరించుకొని పట్టణ శివారులోని సిద్దనొంపు ఆంజనేయ స్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. పట్టణంలోని గాయత్రి నర్సింగ్‌హోం నిర్వహకులు వెంకటేశ్వర్లుతో పాటు మండల పరిధిలోని బుల్కాపూర్ గ్రామస్థులు వేర్వేరుగా స్వామివారికి పూజలు నిర్వహించారు. అభిషేకంతో భజన కార్యక్రమాలు కొనసాగించారు. పూజా కార్యక్రమాల అనంతరం ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసం ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలో ఆంజనేయస్వామికి గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

'రుబెల్లా వ్యాధి నివారణకు కృషి'



టీకాలు వేస్తున్న సిబ్బంది

కొడంగల్: తట్టు, మీజిల్స్ రుబెల్లా వ్యాధి నివారణ కోసం కృషి చేద్దామని కేజీబీవీ ప్రత్యేకాధికారిణి స్రవంతి అన్నారు. శనివారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినిలకు ఒకే టీకాతో రెండు వ్యాధుల నివారణకు రుబెల్లా టీకాలను వేశారు. పాఠశాలలోని దాదాపు 150 మందికి పైగా విద్యార్థినిలకు టీకాలను వేసి మందులను అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రుబెల్లా టీకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫి దినోత్సవాన్ని నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శివశంకర్, వెంకటేశ్, అశోక్, చందు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. **- దౌల్తాబాద్**

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లా, రాష్ట్ర నాయకులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

నియోజకవర్గంలో ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి సుడిగాలి పర్యటన

- **మిషన్ భగీరథ, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనుల్లో జాప్యం**
- **ఆసుపత్రి పనితీరుపై ఈ నెల 24లోపు వివరాలు ఇవ్వాలి**

ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి

కొడంగల్: అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్‌లు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతగా కొనసాగే విధంగా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. శనివారం ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిద్దనొంపు సమీపంలో నిర్మాణం చేపడుతున్న మిషన్ భగీరథ పనుల్లో జాప్యం జరగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పనులను పరిశీలించి 10 నెలల తర్వాత వచ్చినా పనుల్లో పురోగతి కనిపించడం లేదన్నారు. ఈ విధంగా పనులు కొనసాగితే 2020 సంవత్సరం వరకు కొనసాగే అవకాశం ఉందన్నారు. పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాసిరకంగా చేపడుతున్నారని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడుతూ పనుల్లో నాణ్యతను పాటిస్తూ వేగవంతం చేయాలన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో 50 పడకల నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు చేపట్టడంలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటుందని అధికారులతో ఫోన్ ద్వారా వివరించారు. స్థానిక మున్సిఫ్ కోర్టు ఆవరణలో నిర్మాణం చేపట్టిన సబ్ జైలు మరమ్మతు పనులు పూర్తి కావడంతో సబ్‌జైలును పరిశీలించారు. సబ్ జైలు పనులు పూర్తి కావడంతో ప్రారంభానికి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, సిబ్బంది కొరత, వసతులు తదితర అంశాలపై ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న కేసీఆర్ కిట్ 7 రకాల్లో బెడ్ షీట్‌లు అందుబాటులో ఉన్నాయా అని ప్రశ్నించారు. ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతున్నా కొడంగల్‌కు మాత్రం 50 పడకల ఆసుపత్రిని మంజూర్ చేయడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు చికిత్సలు నిర్వహిస్తున్న వివరాలను ఆసుపత్రిలోని నోటిసు బోర్డులో ఎప్పటికప్పుడు ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత, సమస్యలపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది వైశాలి, ప్రతాప్‌చౌహాన్, వాల్యా, బసప్ప, వీణ, నాయకులు ఎండీ.యూసుఫ్, ఎన్.ప్రశాంత్, సంజీవ్‌రెడ్డి, ఎన్.రాజు, హన్మంత్‌రెడ్డి, శేఖర్, ముస్తాక్ తదితరులు ఉన్నారు.



సబ్‌జైలు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి



ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

ఆంజనేయస్వామి ప్రతిష్ఠాపనలో...

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మండల పరిధిలోని చిన్ననందిగామ గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహా ప్రతిష్టాపనను వేద మంత్రాల మధ్య చేపట్టారు. ఈ సందర్భంగా హోమం, పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి, సోదరుడు తిరుపతిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి అందించిన ప్రోత్సాహంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు కిట్టుస్వామి ఎమ్మెల్యేతో పాటు పలువురికి సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు దత్తుస్వామి, విజయమ్మ, తిరుపతయ్య గౌడ్, అబ్దులప్ప, హన్మంత్‌రెడ్డి, ఎండీ.యూసుఫ్, సంజీవ్‌రెడ్డి, ఎన్.ప్రశాంత్ తదితరులు ఉన్నారు.



చిన్ననందిగామలో విగ్రహ ప్రతిష్ఠాపనల్లో ఎమ్మెల్యే

గిరిజన తండాలను గుర్తించాలి...

బొంరాస్‌పేట్: 500 జనాభా గల గిరిజన తండాలను గుర్తించి నివేదిక అందించాలని ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని చిలుముల్‌మైలారంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. సౌకర్యాలు తదితర అంశాలపై విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో అధికారులతో మాట్లాడి ప్రభుత్వం ప్రత్యేకంగా గిరిజన గ్రామ పంచాయతీలను ప్రకటిస్తున్న నేపథ్యంలో మండలంలో ఏ తండాల్లో 500 జనాభా దాటిందో వివరాలు అందించాలన్నారు. జాబితాను సక్రమంగా ఇవ్వకపోవడంతో నియోజకవర్గంలో అత్యధికంగా తండాలు గల బొంరాస్‌పేట్‌కు అన్యాయం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ శ్యామ్‌సుందర్, శ్రీనివాస్, టీడీపీ నాయకులు రాజేశ్‌రెడ్డి, నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, ఎంపీటీసీ నర్సిములునాయుడు, మెరుగువెంకటయ్య, భీమయ్యగౌడ్, రాములు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి

ఎన్ఐఓఎస్ సామగ్రి పంపిణీ



సామాగ్రిని పంపిణీ చేస్తున్న ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి

దౌల్తాబాద్: 15 సంవత్సరాలు దాటిన గ్రామాల్లోని వయోజనులకు ఆదివారం నేషనల్ లిటరేసి మిషన్ ఆథారిటి ఆధ్వర్యంలో అక్షరాస్యత పరీక్ష నిర్వహించాలని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సాక్షరభారత్ గ్రామ కో ఆర్డినేటర్‌లకు ఎన్ఐఓఎస్ ప్రశ్నాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మధ్యలో బడి మానేసిన వారు, నూతన అక్షరాస్యులు పరీక్షను రాయవచ్చునన్నారు. ఈ సందర్భంగా మండల కో ఆర్డినేటర్ వెంకటేశ్, సూపరిండెంట్ నర్సింహారెడ్డి ఉన్నారు.

కూటి కోసం కోటి విద్యలు

కొడంగల్‌రూరల్: కూటి కోసం కోటి విద్యలు అనే చందంగా ఉంది పై చిత్రంలోని దృశ్యం నాలుగు మెతుకులు తినాలంటే ఏదో ఒకటి చేయాలి కాబట్టి ఇద్దరు భార్యభర్తలు మారుతి కారులో ఉంగరాలు, పంటినొప్పుల తగ్గించే మందులు తదితర వాటిని ఉంచి వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు అమ్మిసొమ్ము చేసుకోవడం చూసిన వారు ఔరా కూటికోసం కోటి విద్యలు అంటే ఇదేనా అంటు చర్చించుకోవడం చోటుచేసుకుంది.



నాలుగు రోజులుగా కొనసాగుతున్న తపాల ఉద్యోగుల సమ్మె

అనంతగిరి : గ్రామీణ తపాల ఉద్యోగులు నాలుగు రోజులుగా సమ్మె చేస్తుండడంతో తపాల సేవలు నిలిచిపోయాయి. గ్రామాల్లో వృద్ధాప్య పింఛన్లు, ఉత్తరాలు పోస్టల్ సేవింగ్ ఖాతా సేవలు నిలిచిపోయాయి. గ్రామీణ తపాల సేవల ఉద్యోగులకు 7వ తరగతి వేతనాలు ఇస్తూ వారికి అదనపు

నిలిచిన తపాల సేవలు

పనులు అప్పగించడమే ఈ సమ్మెకు కారణం అయ్యింది. కేంద్ర ప్రభుత్వం తమను పూర్తిస్థాయి ఉద్యోగులుగా గుర్తించి, వేతనాలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అందించాలని డిమాండ్ చేస్తున్నారు.



మేకవనంపల్లిలో రక్త నమూనా కార్డులను పంపిణీ చేస్తున్న గ్రామ సర్పంచ్ శంకర్

'ప్రతి ఒక్కరు రక్త నమూనా పరీక్షలు చేయించుకోవాలి'

మోమిన్‌పేట : సమాజంలోని ప్రతి ఒక్కరు రక్త నమూనా పరీక్షలు చేయించుకోవాలని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శంకర్ సూచించారు. శనివారం మండలంలోని మేకవనంపల్లి గ్రామంలో యంగ్‌లీడర్స్ ఆధ్వర్యంలో రక్త నమూనా పరీక్షలను గ్రామస్తులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రులలో వివిధ చికిత్సల సందర్భంగా రక్త నమూనా పరీక్షలు తెలిసి ఉంటే త్వరగా రక్తాన్ని సేకరించే వీలుంటుందన్నారు. రక్త నమూనా పరీక్షల వల్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల యంగ్‌లీడర్స్ కోఆర్డినేటర్ చంద్రమౌళి, నాయకులు కృష్ణ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువజనులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు కొత్త పెసర్లు

ధారూరు : వ్యవసాయ మార్కెట్ యార్డుకు కొత్త పెసర్లు వచ్చాయి. శనివారం సాయంత్రం రైతులు తెచ్చిన పెసర్ల బస్తాలను బీట్లు నిర్వహించారు. బీట్లు నిర్వహణ కార్యక్రమంలో ధారూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజునాయక్ పాల్గొని ప్రారంభించారు. పెసర్లను బీట్లు వేసిన అనంతరం పెసర బస్తాలను ఛైర్మన్ తూకం వేసారు. బీట్లలో పెసర్లు క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.4,700, కనిష్ఠంగా రూ.4,300 ధర పలికింది. 27.50 క్వింటాళ్ల పెసర్లు మార్కెట్ యార్డుకు వచ్చాయి. పసుపు కూడా 25.20 క్వింటాళ్లు రాగా గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ.6,300, కనిష్ఠంగా రూ.5,400 ధర పలికింది. ఈ బీట్ల కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి దుమ్డానాయక్, కమీషన్ ఏజెంట్లు, ఖరీదుదారులు పాల్గొన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'



మురుగు కాలువల్లో చెత్త తీస్తున్న కూలీలు

మోమిన్‌పేట : మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామంలో శనివారం గ్రామ పంచాయతీ నిధుల ద్వారా మురుగు కాలువల్లో ఉన్న చెత్తను మురుగును కూలీలతో తీయించారు. పరిసరాల పరిశుభ్రత, సంపూర్ణ పారిశుధ్యం పాటించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని సర్పంచ్ మల్లారెడ్డి కోరారు. మురుగునీరు నిల్వకుండా, ఇంటి పరిసరాల చుట్టూ చెత్తాచెదారం వేయకుండా పాటించాలని ఆయన చెప్పారు. తీసిన మురుగు, చెత్త చెదారాన్ని వెంటనే డంపింగ్‌యార్డుకు తరలించనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శనైశ్చరస్వామి తైలాభిషేకాలు

మోమిన్‌పేట : శని త్రయోదశిని పురస్కరించుకుని ఎన్కతల శనైశ్చర స్వామికి భక్తి శ్రద్ధలతో పలువురు భక్తులు ప్రత్యేక తైలాభిషేకాలను నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో ఉన్న సప్త వృక్షాలు, సప్త దేవాలయాలను దర్శించుకుని భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు ప్రముఖులు శనైశ్చర స్వామిని దర్శించుకుని అభిషేకాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులందరికి ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదలు సంతోషం

- పన్నుల పేరిట దండుకుంటున్న టీఆర్ఎస్ ప్రభుత్వం
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు ప్రసాద్‌కుమార్



కొండాపూర్ కలాన్ గ్రామంలో మాట్లాడుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు ప్రసాద్‌కుమార్

ధారూరు : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేద ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఏనాడు కూడా వారిపై పన్నుల పేరిట భారం మోపలేదని, టీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల నుంచి పన్నుల పేరిట డబ్బులను పీడించి డబ్బులను వసూలు చేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. ధారూరు మండలంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన గ్రామ కమిటీల నియామకం కార్యక్రమాన్ని శనివారం ఆయన రాళ్లచిట్టంపల్లి గ్రామంలో ప్రారంభించారు. అనంతరం కొండాపూర్ కలాన్, దర్మాపూర్, మున్నూర్ సోమారం తదితర గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల నుంచి కేసీఆర్ ప్రభుత్వం ఇంటి పన్నులు వసూలు చేసిందని, చెల్లించనివారిని పింఛన్ డబ్బులను పన్నుల కింద జమ చేసుకున్నారని ఆయన విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ మూడేళ్లుగా నాన్చుతూ పేద ప్రజలను మోసపుచ్చుతున్నారని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం కుటుంబ పాలనతో డబ్బులను దండుకునే కార్యక్రమాలను కొనసాగిస్తుందని, ప్రజలకు చేస్తున్నది ఏమి లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తాను నియోజకవర్గంలో అభివృద్ధి కోసం రూ.600 కోట్లు మంజూరుచేసి రోడ్లు, చెరువుల మరమ్మతులను చేయించామని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న మిషన్ కాకతీయ పనుల్లో కమీషన్ల పేరిట దండుకుని చెరువు, కుంటల పనులను అస్తవ్యస్తంగా చేస్తున్నారని ఆయా గ్రామాల్లో రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారని ఆయన తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఓటర్లు ఆలోచించి ఓటు వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ధారూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, వికారాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, ఎంపీటీసీలు మాన్‌సింగ్, రమేష్‌కృష్ణ, బాలప్ప, సర్పంచులు పాండునాయక్, కన్నె బిచన్న, జిల్లా నిరుద్యోగుల జేఏసీ ఛైర్మన్ జొన్నాల రవిశంకర్, సొసైటీ డైరక్టర్లు సత్యనారాయణగౌడ్, సత్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారికి టీకా వేయించాలి



మేకవనంపల్లిలో చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది



టీకాలు వేసిన విద్యార్థులకు వేలికి మార్కు చేస్తున్న జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు

మోమిన్‌పేట : గ్రామాల్లో ఉన్న చిన్నారులకు, బాలబాలికలకు మిజిల్స్, రుబెల్లా టీకాలు వేయించాలని మండల వైద్యాధికారి అబ్దుల్లా సూచించారు. శనివారం మండలంలోని మేకవనంపల్లి గ్రామంలో పాఠశాల విద్యార్థులకు రెండు వ్యాధులకు ఒకే టీకాను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏడాది నుంచి 15 సంవత్సరాలలోపు ఉన్న బాలబాలికలకు ఈ టీకాలను వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శంకర్, ప్రభుత్వాసుపత్రి హెచ్‌సీవో చంద్రశేఖర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కోట్‌పల్లిలో..

కోట్‌పల్లి(బంట్వారం) : 9 నెలల నుంచి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు తప్పకుండా రుబెల్లా వ్యాక్సిన్ను వేయించాలని ఎన్నారం సర్పంచ్ శ్రీనివాస్, కోట్‌పల్లి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు నర్సిములు అన్నారు. శనివారం కోట్‌పల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో రుబెల్లా వ్యాధి నివారణకు విద్యార్థులకు వైద్య సిబ్బంది టీకాలు వేసారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ ఈశ్వర్, ఉపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి, వైద్య సిబ్బంది అధ్వర్లు పాల్గొన్నారు.

నవాబుపేటలో...

నవాబుపేట : రెండు ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకు మిజిల్స్, రుబెల్లా టీకాలను వేయించుకోవాలని జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు పి.భీంరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పులుమామిడి ఉన్నత పాఠశాలలో రుబెల్లా టీకాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించి తమ కుటుంబాలకు పాటించేటట్లు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్.పాండు, వైద్యాధికారి రేవతిలు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే..

రవికుమార్, ఎస్ఐ, నవాబుపేట

ఇంటర్వ్యూ



నవాబుపేట : మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని జైలుకు పంపిస్తామని ఎస్ఐ రవికుమార్ అన్నారు. అదే విధంగా హెల్మెట్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినవారికి జరిమానాలు విధిస్తూ అవగాహన కల్పిస్తున్నామని ఆయన ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు.

ప్ర : మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ : మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని జైలుకు పంపిస్తున్నాం.

ప్ర : హెల్మెట్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : హెల్మెట్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారికి జరిమానాలు విధిస్తూ అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర : గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

జ : దొంగతనాలు జరగకుండా గస్తీలు నిర్వహిస్తున్నాం.

'గ్రామసభల్లో సమస్యలు పరిష్కరించుకోవాలి'



రెవెన్యూ గ్రామసభలో పాల్గొన్న తహసీల్దార్ గాయత్రి

ధారూరు : రైతులు భూ సమస్యలను గ్రామసభల్లో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని మండల తహసీల్దార్ గాయత్రి తెలిపారు. శనివారం ధారూరు మండల పరిధిలోని గురుదొట్ల గ్రామంలో రెవెన్యూ గ్రామసభలో ఆమె పాల్గొని రైతుల నుంచి అందిన దరఖాస్తులను పరిశీలించారు. గ్రామసభలో పట్టాదారు పేరు మార్పులు, చేర్పులు, విస్తీర్ణం, సర్వే నెంబర్, ఖాతా నెంబర్, మృతి చెందినవారి స్థానంలో వారసులకు విరాసత్, తదితర భూ సమస్యలపై రైతులు ఇచ్చిన దరఖాస్తులను ఆమె పరిశీలించారు. భూ రికార్డులు జరిగిన పొరపాట్లను రికార్డులను పరిశీలించి సరిచేసి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ యాదయ్య, వీఆర్వో శ్రీశైలం, రైతులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఉద్యమ కళాకారుల సంఘం ఎన్నిక

బంట్వారం : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమ కళాకారుల సంఘాన్ని శనివారం చేవెళ్లలో ఎన్నుకున్నారు. బంట్వారం మండల పరిధిలోని బొపునారం గ్రామానికి చెందిన కళాకారుడు సలావుద్దీన్ జిల్లా కోశాధికారిగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు కేశవులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రభుత్వం వెంటనే మిగిలిన కళాకారులను గుర్తించాలని డిమాండ్ చేశారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న కిరణ్‌చంద్ర

సోషల్ మీడియాతో బీజేపీ బలోపేతం

రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు కిరణ్‌చంద్ర

తాండూరు : సామాజిక మాధ్యమాల టెక్నాలజీని ఉపయోగించి బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు కిరణ్‌చంద్ర అన్నారు. తాండూరు శ్రీసరస్వతి శిశు మందిర్‌లో శనివారం బీజేవైఎం ఆధ్వర్యంలో సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా) వర్క్‌షాప్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో 250మంది సోషల్ మీడియా వర్కర్లను తయారుచేయాలని పార్టీ నిర్ణయించిందని చెప్పారు. నియోజకవర్గాల వారీగా వర్క్‌షాపులు నిర్వహించి పార్టీ కార్యక్రమాలు, కేంద్ర సంక్షేమ పథకాలను వివరిస్తామని, సోషల్ మీడియా ద్వారా సమస్యలను తెలుసుకుని రాష్ట్రం నుంచి కేంద్రానికి సోషల్ మీడియా వైరల్ ద్వారా వివరిస్తామని చెప్పారు. సోషల్ మీడియా ద్వారా 30 వేల మంది బీజేపీ కార్యకర్తలను సిద్ధం చేస్తామన్నారు. 45రోజులపాటు నియోజకవర్గాల వారీగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామన్నారు. జిల్లా బీజేవైఎం ఇన్‌చార్జీ రమ్యతేజ మాట్లాడుతూ సోషల్ మీడియాను అధికంగా వినియోగించే వారికి బీజేవైఎం శిక్షణ ఇస్తుందని చెప్పారు. ఏ సమస్య ఉన్నా సోషల్ మీడియాలో పెడితే వైరస్ చేసి అధిక ప్రచారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేవైఎం అధ్యక్షులు వివేకానందరెడ్డి, జిల్లా ఆర్గనైజర్ నాగేందర్, జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి గాజుల వివేక్, బీజేపీ ఐటీ సెల్ ప్రతినిధి సునిల్‌సూరి, పట్టణ బీజేపీ నాయకులు బంట్వారం భద్రేశ్వర్, కృష్ణముదిరాజ్, బాల్‌రాజ్, చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల కుట్టడంపై విచారణ

పరిగి : ఆంధ్రజ్యోతి జిల్లా టాబ్లాయిడ్‌లో శుక్రవారం 'కుట్టులోనూ కక్కుర్తి!' **ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్** పాఠశాల విద్యార్థులకు రెండు జతల దుస్తులు, కొనుగోలు, కుట్టు పనుల్లో నిబంధనలకు పాతర అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. కథనంపై కదిలిన ఉన్నతాధికారులు దుస్తుల కట్టడంపై విచారణకు ఆదేశించారు. ఈమేరకు శనివారం మానిటరింగ్ అధికారి తాజ్‌భద్ర, జీహెచ్ఎం వరలక్ష్మీల బృందం శనివారం పరిగిలోని ఎమ్మార్సీ కార్యాలయంలో విచారణ జరిపించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి హెచ్ఎంలను రప్పించి వేర్వేరుగా విచారణ జరిపించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలి

శాసనసభ మాజీ ఉపసభాపతి హరీశ్వర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉపసభాపతి కె.హరీశ్వర్‌రెడ్డి

పరిగి : పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర పునఃనిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని శాసనసభ మాజీ ఉపసభాపతి కె.హరీశ్వర్‌రెడ్డి అన్నారు. ఎస్టీయూ 70 ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం పరిగిలోని టీటీడీ కళ్యాణ మండపంలో జరిగిన ఎస్టీయూ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కూడా ఉపాధ్యాయుల పాత్ర అమోఘమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల వృత్తిపరమైన సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా కృషిచేస్తానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే బాధ్యత కూడా ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సదానంద్‌గౌడ్ మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించడంలో అన్ని సంఘాల కంటే ఎస్టీయూ ముందుంటుందని తెలిపారు. సర్వీసు రూల్స్ వచ్చినందున ప్రభుత్వం వెంటనే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ సురేందర్, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బసిరెడ్డి, మాణిక్‌రెడ్డి, ఎస్టీయూ పరిగి అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ.షఫీ, దయాకర్, దోమ, పరిగి, కులకచర్ల మండలాల అధ్యక్షుడు ఖయ్యూమ్, వి.కనకాచారి, లక్ష్మారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు వి.రాములు, రవీందర్‌రెడ్డి, ధారూర్ అధ్యక్షుడు వెంకటయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, కొడంగల్, తాండూరు ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో ఆరోగ్యం

- ఆరోగ్యానికి పెరుగుతున్న ప్రాధాన్యం
- దేశీయ వైద్యం పట్ల పెరుగుతున్న ఆసక్తి

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్)

ఆరోగ్యం, అనారోగ్యం ఏదీ ఒక్క రోజులో వచ్చేది కాదు.. పోయేది కాదు.. తల్లి గర్భంలో ప్రాణం పోసుకున్నది మొదలు తిరిగి ప్రాణవాయువు అనంత విశ్వంలో కలిసిపోయే వరకూ.. ఆరోగ్యమైనా.. అనారోగ్యమైనా సంక్రమిస్తోందంటే మన ఆహార, విహారాల ఫలితమే.. తల్లిదండ్రుల జన్యువులు, తల్లి ఆరోగ్య పరిస్థితి, గర్భధారణ సమయంలో ఆమె తీసుకున్న ఆహారం, పోషక పదార్థాలు, జన్మించిన తరువాత అందిన పోషకాహారం, ఆ తరువాత రోజూ తీసుకునే ఆహారం, అనుసరించే జీవన విధానం పైనే ఆరోగ్యమైనా.. అనారోగ్యమైనా ఆధారపడి ఉంటుందనేది అక్షర సత్యం. ఆరోగ్యమే మహాభాగ్యం.. అన్న నానుడిలో అర్థాన్ని గుర్తించిన ప్రజలు ఇటీవల కాలంలో తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గత దశాబ్ద కాలంగా పెరిగిపోతున్న రోగాలతో తమ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్త పడుతున్నారు. గతంలో 50ఏళ్ల పైబడిన వారే ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకునేవారు. ఇరవై ఏళ్ల కిందట ఎక్కువగా ఆ వయస్సు వారికే రోగాలు వచ్చేవి. ఇప్పుడు వయోబేధమంటూ లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు వచ్చేస్తున్నాయి. ప్రజల్లో ఆరోగ్యం పట్ల స్పృహ పెరగడంతో తాము ఆరోగ్యంగా ఉండేందుకు ఎంతటి ఖర్చుకు కూడా వెనకాడడం లేదు. మధ్య తరగతితోపాటు పేద ప్రజలు కూడా ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ తీసుకుంటున్నారు. పౌష్టికరమైన ఆహారం, శుభ్రమైన నీటిని తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏ వ్యాధికైనా చికిత్స కంటే నివారణే ముఖ్యమైన పరిష్కారమని గ్రహిస్తున్న ప్రజలు ఆ దిశగా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రోజూ తినే భోజనం విషయంలో జాగ్రత్త పడుతున్నారు.

వ్యాయామం పట్ల పెరుగుతున్న ఆసక్తి

వ్యాయామం అందరికీ అవసరం అనే దృక్పథం అందరిలో పెరుగుతోంది. పదిహేనేళ్ల వయస్సు నుంచి ఎనభై ఏళ్ల వయస్సు వారి వరకు ఏదో ఒక విధంగా వ్యాయామం పట్ల తమ దృష్టి సారిస్తున్నారు. వ్యాయా



మం విషయంలో మహిళలు పురుషులతో పోటీ పడుతున్నారు. నడక, జాగింగ్‌తోపాటు ఇతర వ్యాయామాలు చేస్తున్నారు. తమ వయస్సు, శక్తి అనుసరించి వ్యాయామం చేస్తున్నారు. చిన్నతనం నుంచి వ్యాయామం, ఆటల పట్ల ఆసక్తి పెంచుకుంటున్నారు. గతంలో 50 ఏళ్లపైబడిన వారు మాత్రమే వాకింగ్‌కు వెళ్లేవారు. ఇప్పుడు 35 ఏళ్ల వయస్సు పైబడినవారు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త పడుతున్నారు. బరువు తగ్గించుకునేందుకు శ్రద్ధ తీసుకుంటున్నారు. వ్యాయామంతోపాటు యోగా పట్ల కూడా ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. సంపూర్ణ ఆరోగ్యం పొందడానికి యోగా ఒక మార్గంగా భావిస్తున్నారు. పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత యోగ శిబిరాలకు పురుషులతోపాటు మహిళలు, యువతీ, యువకులు, చిన్నారులు కూడా హాజరవుతూ ఆరోగ్య పరిరక్షణకు తమవంతు ప్రయత్నం చేస్తున్నారు.

శాఖాహారానికి పెరుగుతున్న ఆదరణ

ప్రజలు తాము రోజూ తీసుకునే ఆహారం పట్ల ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నారు. పలువురు మాంసాహారులు తమ ఆరోగ్యం పరిరక్షించుకునేందుకు మాంసాహారం కన్నా శాఖాహారం తీసుకునేందుకే ఇష్టపడుతున్నారు. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా, ఊబకాయం రాకుండా ఉండేందుకు శాఖాహారమే అన్నింటా మేలని భావించే వారి సంఖ్య పెరుగుతోంది. ఆకు కూరలు, కాయగూరలు, ముఖ్యంగా చిక్కుడు జాతి కూరగాయలను తీసుకుంటున్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త పడేవారిలో 35 సంవత్సరాలు దాటిన వారు రోజూ గోధుమలు, శనగలు, మినపపప్పు, బాదం, ఎండు ఖర్జూరాలు, పాలు, పెరుగు, మజ్జిగతోపాటు రోజూ గుప్పెడు మొక్కలు మొలిచిన గింజలు రోజూ తీసుకునేలా శ్రద్ధ తీసుకుంటున్నారు. రాగులు జావగానో, లేదా రొట్టెల రూపంలోనో తీసుకుంటున్నారు. ఇదిలా ఉంటే, రోజూ వీలుకాకున్నా వారానికి రెండు రోజుల పాటైనా ఆయా కాలాల్లో సమృద్ధిగా లభించే పండ్లు, ఫలాలను తినే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉంటే, ఆరోగ్యం పట్ల జాగ్రత్త పడే మాంసాహారుల్లో చాలావరకు ప్రత్యేకమైన సందర్భాల్లోనో, లేక వేడుకల్లోనో మాత్రమే మాంసాహారం తీసుకుంటున్నారు. మిగతా సమయాల్లో శాఖాహారమే బెస్ట్ అని భావిస్తూ తమ నోటిని అదుపు చేసుకుంటున్నారు. అయితే జిహ్వ చాపల్యం చంపుకోలేని వారు మాత్రం ఐదారు రోజులకోసారైనా మాంసాహారాన్ని వీడలేకపోతున్నారు.

దేశీయ వైద్యం పట్ల పెరుగుతున్న మక్కువ

పెరుగుతున్న రోగాలతో ప్రజల ఆలోచనా విధానంలో కూడా మార్పు వస్తోంది. వెంటనే ఫలితం చూపించే అల్లోపతి వైద్యంతోపాటు అనాదిగా వస్తున్న భారతీయ వైద్య విధానం పట్ల వారు తమ దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఆయుర్వేదం, హోమియోపతి వైద్యంలో కూడా చికిత్స పొందడానికి ఆసక్తి చూపుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అల్లోపతి వైద్యాన్ని ఆశ్రయిస్తూ... దీర్ఘకాల రోగాల నుంచి బయట పడేందుకు ఆయుర్వేదం, హోమియోపతి వైద్యం తీసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. వైద్య విధానాల్లో ఆయుర్వేదం ప్రముఖ పాత్ర పోషిస్తుండంతో ప్రజలు ఈ వైపుగా దృష్టి సారిస్తున్నారు. వ్యాధులు పటాపంచలు చేసే పంచకర్మల పట్ల వారు ఆకర్షితులవుతున్నారు. దీర్ఘకాల రుగ్మతలైన మధుమేహం, రక్తపోటు, వెన్నునొప్పి తదితర సమస్యలతో బాధపడేవారిలో చాలా మంది ఇటీవల కాలంలో ఆయుర్వేదం, హోమియోపతి, యునాని వైద్యం పట్ల ఆసక్తి చూపుతున్నారు. ఆయుర్వేద వైద్యాన్ని ప్రజలు గతంలో కంటే ఇప్పుడు ఎక్కువగా ఆదరిస్తున్నారు. వికారాబాద్‌లో పతంజలి యోగసమితి నిర్వాహకులు వన మూలికల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. వన మూలికా దినోత్సవం సందర్భంగా వివిధ వన మూలికలను తీసుకువచ్చి ఏ మూలిక ఎందుకు వినియోగిస్తారనేది వివరిస్తారు. ఆయుర్వేదం వైద్య విధానం పట్ల వారు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

నిరుద్యోగులను మభ్యపెడుతున్న కేసీఆర్

- ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి

కొడంగల్ : ఉమ్మడి జిల్లాల ప్రకారమే ఉద్యోగ నియామకాలను చేపడుతున్నట్లు ప్రకటించడంపై మరోసారి కేసీఆర్ ద్వంద నీతి బయటపడిందని రాష్ట్ర టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లాలోని కొడంగల్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనలో నియమ, నిబంధనలను పాటించకుండా టీఆర్ఎస్‌కు అనుకూలంగా ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. కొత్త జిల్లాల ప్రకారం ఉద్యోగ నియామకాలను చేపట్టకుండా ఉమ్మడి జిల్లాల ప్రకారంగా చేపడుతూ నిరుద్యోగులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. లక్ష 20వేలకుపైగా ఉద్యోగాలు చేపట్టాల్సి ఉన్నా ఇప్పటివరకు 5,940 ఉద్యోగాలను మాత్రమే కల్పించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అన్నారు. జిల్లాల పునర్విభజన సమయంలో పలుమార్లు సూచనలు చేసినా, న్యాయపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని అసెంబ్లీలో ప్రస్తావించినా పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. పిచ్చోడి చేతికి రాయి ఇస్తే ఏ విధంగా ఉంటుందో... కేసీఆర్ చేతిలో రాష్ట్రం పెడితే ఆ విధంగా తయారైందని ఎద్దేవా చేశారు. తరచూ నిరుద్యోగ యువతను మభ్యపెడుతుండటంతో నష్టపోయినవారు కోర్టు కెళ్లడంతో ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని ఆరోపించడం సరికాదన్నారు. ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ల అమలుపై ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేస్తానని చెబుతున్న ముఖ్యమంత్రి హైదరాబాద్‌లో ధర్నాచౌక్‌ను ఎత్తేయడం ఎంతవరకు సమంజసమన్నారు. జీఎస్టీ అమలులో అసెంబ్లీ తీర్మానంతోపాటు పార్లమెంట్‌లో జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మద్దతు తెలిపి తీరా జీఎస్టీతో అన్యాయం జరుగుతుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జీఎస్టీ అమలుతో 30వేల కోట్ల రూపాయల భారం పడుతుందని, దీనిపై కోర్టుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్న ముఖ్యమంత్రి అవగాహన రాహిత్యంగా తానే ఆమోదం తెలిపిన అంశంపై ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు. జీఎస్టీతో జరిగిన అన్యాయంలో సీఎం పాత్ర ఉందని, ఆయన పైనే కేసులు వేసుకుంటారా అని ప్రశ్నించారు. 15 ఆగస్టు రోజున ప్రసంగంలో పచ్చి అబద్ధాలను బహిర్గతం చేశారన్నారు. తరచూ నిరుద్యోగ యువతను మభ్య పెడుతున్న కేసీఆర్‌కు గుణపాఠం చెప్పేందుకు యువత మరో పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు నర్సింగ్‌బానోసింగ్, బోడి వెంకట్‌రెడ్డి, ఎండీ.యూసుఫ్, ఎన్.ప్రశాంత్, ఎన్.రాజు, సంజీవ్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల నిర్మాణ పనులు వేగవంతం చేయండి : కలెక్టర్ దివ్య

వికారాబాద్ : జిల్లాలో వివిధ దశల్లో కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణం పనులను వేగవంతం చేసి పూర్తిచేయాలని కలెక్టర్ దివ్య దేవరాజన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఆమె వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణ పనుల పురోగతిపైన ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణాల్లో వికారాబాద్‌లో 100 పడకలు, పరిగిలో 30, కొడంగల్‌లో 50 పడకల ఆసుపత్రులతోపాటు తాండూరులో మెటర్నిటీ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్, ప్రసూతిశాలల నిర్మాణాలు ఉన్నాయని ఆమె చెప్పారు. జిల్లాలో వివిధ దశల్లో కొనసాగుతున్న పది ఆసుపత్రుల భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం లేకుండా చూసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. సమీక్షలో టీఎస్ఎంఎస్ఐడీసీ ఈఈ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు వికారాబాద్‌లో

ప్రజావాణి

వికారాబాద్ : ఈనెల 21వ తేదీన వికారాబాద్‌లోని ఆర్డీవో కార్యాలయంలో జిల్లాస్థాయి ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దివ్య దేవరాజన్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆమె సూచించారు.

జడ్పీ నిధులపై లొల్లి..


వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి ప్రతినిధి/ రంగారెడ్డి అర్బన్) : స్థానిక సంస్థలకు నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యంపై రంగారెడ్డిజడ్పీ సమావేశంలో ప్రతిపక్ష సభ్యులు తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయకపోవడంతో తాము గ్రామాల్లో తిరగలేకపోతున్నామని ప్రతిపక్ష సభ్యులు సమావేశం ఆరంభలోనే ఆందోళనకు దిగారు. జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన జడ్పీ సమావేశానికి రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి మహేందర్ రెడ్డితో పాటు మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డి, వికారాబాద్ కలెక్టర్ దివ్య, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ సుందర్ అబ్నార్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంకాగానే స్థానిక సంస్థల నిధులపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. స్థానిక సంస్థలకు నిధుల విడుదల విషయంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుండడంతో అభివృద్ధి కుంటుపడుతుందని ఆరోపించారు. స్థానిక సంస్థలకు ఇవ్వాల్సిన నిధులను ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకుంటుందని దీంతో స్థానిక సంస్థలు నిర్వీర్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు లేక స్థానిక సంస్థలు ఇబ్బందులు పడుతున్నాయని ఈ విషయంపై పలు మార్లు ప్రభుత్వానికి విన్నవించినా స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు లేక స్థానిక సమస్యలు పరిష్కరించలేకపోతున్నామని వాపోయారు. న్యాయబద్దంగా ఇవ్వాల్సిన నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల నుంచి వత్తిడులు వస్తున్నాయని ఇందువల్ల గ్రామాలకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు లేకుండా సమావేశాలు పెట్టి కూడా దండగేనని అన్నారు. తక్షణమే దీనిపై సమావేశంలో చర్చించి తీర్మానం చేయాలని అప్పటి వరకు సమావేశం జరగనీయబోమని జడ్పీకాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ జంగారెడ్డి లేచి కింద బైఠాయించారు. ఆయనకు మద్దతుగా కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ సభ్యులంతా ఫ్లకార్డులతో సమావేశంలో బైఠాయించారు. ఈ సమయంలో కొందరు అధికార పార్టీ సభ్యులు కూడా వీరికి మద్దతుగా ఫ్లకార్డులు అందించడం గమనార్హం. ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని సభ్యులు సభలో నినాదాలు ఇవ్వడంతో వారికి సర్ధిచెప్పేందుకు మంత్రి మహేందర్‌రెడ్డి ప్రయత్నించారు. ఇదేసమయంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి జోక్యం చేసుకుని స్థానిక సంస్థలకు నిధులు రాకపోవడంపై తమకు బాధగా ఉందని ఈ సమస్యను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినందున ఆందోళన విరమించాలని కోరారు. గత ప్రభుత్వాలు కూడా సీనరేజ్ నిధులు విడుదల చేయలేదని పది రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించాలని తాము కూడా మంత్రిని కోరుతున్నామని చెప్పారు.

వాగ్వావాదం...

ప్రతిపక్ష సభ్యులకు అధికార పార్టీకి చెందిన కొందరు నేతలకు సమావేశంలో తీవ్ర వాగ్వివాదం జరిగింది. నిధుల సమస్యపై గతంలోనే సభలో తీర్మానం చేశామని. దీనిపై సీఎంతో చర్చించామని మరో సారి కూడా సీఎంను కలిసి నిధులు ఇవ్వాలని కోరతామని మంత్రి మహేందర్‌రెడ్డి సభ్యులకు తెలిపారు. అలాగే మరోసారి సభలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుదామని ఆందోళన విరమించాలని కోరారు. అయితే దీనిపై సమావేశంలో చర్చజరగాల్సిందేనని వారంతా పట్టుబట్టారు. దీంతో మంత్రి మహేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ అసెంబ్లీలో వలే చేస్తున్నారు... ఆందోళన విరమించకుంటే మా పని మేము చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అయినా కూడా వారు ఆందోళన విరమించలేదు. దీంతో మేడ్చల్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జోక్యం చేసుకుని స్థానిక సంస్థలకు నిధులు త్వరలోనే విడుదలవుతాయని ఈ సమస్యను ఇటీవల మేడ్చల్ వచ్చిన సీఎంకు కూడా వివరించామని ఆయన హామీ ఇచ్చారని ఇందువల్ల ఆందోళన విరమించాలన్నారు. ఒక వేళ మీరు ఇలానే నిరసన తెలిపితే తీసి అవతల పడేసే పద్దతి ఒకటి ఉందని హెచ్చరించారు. దీంతో కొందరు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మీరెందుకు ఇక్కడ మాట్లాడుతున్నారని ఎమ్మెల్యేను ఎదురు ప్రశ్నించారు. ఏ మర్యాదగా మాట్లాడండి... మీపై అసెంబ్లీ హక్కుల కమిటీలో ఫిర్యాదు చేసి అంటూ ఎమ్మెల్యే ప్రతిపక్షసభ్యులను హెచ్చరించారు. చివరకు మంత్రి ఆదేశాలతో పోలీసులు సమావేశమందిరంలోకి వచ్చి ఆందోళన చేస్తున్న సభ్యులను బయటకు తీసుకువెళ్లే యత్నం చేశారు. అయితే ప్రతిపక్ష సభ్యులు మమ్మల్ని బయటకు తీసుకువెళ్లేందుకు పోలీసులు అసవరం లేదు... మేమే సమావేశాన్ని బహిష్కుసున్నామంటూ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఫ్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జడ్పీలో ర్యాలీ తీశారు. స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులందరినీ ఉత్సవ విగ్రహాలుగా మారుస్తుందని దుయ్యబట్టారు.

వచ్చే ఏడాది నుంచి ప్రతిరైతుకు రెండు పంటలకు రూ. 8 వేలు : మంత్రి



రైతులు అనుభవిస్తున్న కష్టాలను దూరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక ఆదర్శవంతమైన పథకాన్ని వచ్చే సంవత్సరం నుంచి ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి డాక్టర్ పి. మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వమే పంటకు అవసరమైన పెట్టుబ డిని అందిం చాలని నిర్ణయించినట్లు చెప్పారు. సంవత్సరంలో రెండు పంటల కోసం ఎకరానికి రూ.8 వేల చొప్పున రాష్ట్రంలోని ప్రతీ రైతుకు వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వమే పెట్టుబడిని సమకూర్చనుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన ఈ పథకం దేశంలో ఆదర్శంగా నిలవనున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో రూ. 200 కోట్లతో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. అనుకున్న గడువులోగా ప్రతి ఇంటికి సురక్షితమైన నీటిని అందించనున్నట్లు చెప్పారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా వేయి కోట్లతో రోడ్డు మధ్యలో బిడ్జీలను నిర్మిస్తున్న ట్లు చెప్పారు. రూ.340 కోట్లతో 113 విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూ రు చేయటం జరిగిందని తెలిపారు. రైతులకు 9 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నట్లు, రాబోవు రోజుల్లో 24 గంటల విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని తెలిపారు. కాంగ్రెస్, టీడీపీ, బీజేపీకి చెందిన కొంత మంది సభ్యులు ఉద్దేశపూర్వకంగానే సమావేశంలో బైటాయించారని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. జడ్పీ సమావేశాన్ని డిస్టబ్ చేశారని, నిధుల విషయంపై ఎంత నచ్చజెప్పినా వినలేదని అన్నారు. కావాలనే రాజకీయం చేశారని, ఇది మంచి పద్ధతి కాదని, వాళ్ల విజ్ఞతకే వదిలేశా అని మంత్రి పేర్కొన్నారు.

● ప్రజా సమ స్యలపై స్పందించండి : జడ్పీ చైర్‌పర్సన్



ప్ర జా సమస్యలపై అధికారులు వెం టనే స్పందిం చాలని జడ్పీ చైర్ పర్సన్ పి. సునితారెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన జడ్పీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. హరితహారంపై శాఖల వారిగా నిర్ధేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటిని సంరక్షించటం కూడా అంతే ముఖ్యమని చెప్పారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకై 14వ ఆర్థిక సంఘం నిధులు మంజూరైనట్లు చెప్పారు. ప్రధానంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని తెలిపారు. వరుణుడు కరుణించడంతో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పంటలు ఆశజనకంగా ఉన్నట్లు చెప్పారు. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్దతులు పాటించేలా రైతులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఉపాధి' హామి పథకానికి వ్యవసాయ రంగాన్ని అనుసందానం చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలో అనుబంధ గ్రామాల్లో రోడ్లు అస్థవ్యస్థంగా ఉన్నట్లు, అధికారులు వెంటనే రోడ్లను బాగు చేయించాలని ఆదేశించారు. కురుమ, గొల్ల, యాదవులు ఆర్థికంగా అభివృద్ది చెందటం కోసం ప్రభుత్వం గొర్రెల పథకాన్ని ప్రవేశ పెట్టిందని తెలిపారు. గొర్రెలకు మెరుగైన వైద్యం అందివ్వాలని సూచించారు.


సమావేశంలో నిరసన వ్యక్తం చేస్తున్న సభ్యులు

● దుర్మార్గపు పాలన : కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ జంగారెడ్డి



రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగుతుందని జడ్పీకాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ జంగారెడ్డి ఆరోపించారు. జడ్పీ సమావేశం బయిష్కరించిన అనంతరం జడ్పీ ప్రాంగణంలో ఫ్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసీఆర్ పాలనలో స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యమైనట్లు పేర్కొన్నారు. సినరేజీ, స్టాంపుడ్యూటీ నిధులు విడదల చేయటంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని చెప్పారు. ఈ ఆందోళన కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీపీ నర్సింహులు, జడ్పీటీసీ కలావతి, మహేశ్వరం ఎంపీపీ స్నేహ, గండీడ్ ఎంపీపీ జ్యోతి, శంషాబాద్ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య, కందుకూరు ఎంపీపీ అశోక్, శామీర్‌పేట జడ్పీటీసీ బాలమల్లేష్, శంషాబాద్ జడ్పీటీసీ సతీష్, సరూర్‌నగర్ జడ్పీటీసీ జిలెల్ల నరేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎంపీపీ ఐలయ్య, పెద్దేముల్ జడ్పీటీసీ సర్వమల్లేష్, దారూర్ జడ్పీటీసీ రాములు, డీసీఎంఎస్ చైర్మెన్ శ్రవణ్‌గౌడ్, గండీడ్ ఎంపీపీ శాంతి, ఎల్బీనగర్ జడ్పీటీసీ నరేందర్‌రెడ్డిలు ఆందోళన చేశారు.

రోడ్లను బాగు చేయండి..

ఉమ్మడి జిల్లాలో అధిక చోట్ల అధ్వానంగా మారిన రోడ్లను బాగుచేయించాలని సభ్యులు కోరారు. నవాబుపేట-యాపూర్ రోడ్డు కోసం నిధులు మంజూరై 2 సంవత్సరాలు గడుస్తుంది. ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణం జరగలేదని జడ్పీటీసీ రాంరెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కీసర మండలంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని డివైడర్ ఏర్పాటు చేయాలని సభ్యురాలు రమాదేవి కోరారు. పరిగి రోడ్డు ఏమైందని వికారాబాద్ కోఆప్టెడ్ సభ్యుడు ప్రశ్నించారు. హైదరాబాద్ నుంచి బీజాపూర్ రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదాలు నెలకొంటున్నాయని, వికారాబాద్‌లోని రిక్షా కాలనీలో రోడ్డు వేయించాలని కోరారు.

● వేలాడుతున్న వైర్లను సరిచేయండి

వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని సభ్యులు కోరారు. చేవెళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో డీఈ పోస్టు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య మంత్రిని కోరారు. చేవెళ్లకు మంజూరైన డీఈ పోస్టును ఇబ్రహీంబాగ్‌కు తరలించారని ఆరోపించారు. పరిగిలో రోజుకు పది సార్లు కరెంట్ వచ్చిపోతుందని,పట్టపగలు వెలుగుతున్న వీది దీపాలను ఆర్పాలని తెలిపారు. నాగిరెడ్డిగూడలో ఓల్టేజీ సమస్య తీర్చాలని గత కొన్నాళ్లుగా అధికారులకు తెలిపినా పట్టించుకోవటం లేదని జడ్పీటీసీ ఆరోపించారు. గండిపేట మండలంలో ఇనుప స్థంభాలు ఉన్నాయని దీంతో వర్షం పడినప్పుడు షాక్ కొడుతుందని, వెంటనే ఇనుక స్థంభాలను తొలగించాలని కోరారు.

● ఆసుపత్రుల కోసం తీర్మానం చేయండి...

జడ్పీ సమావేశంలో ఆసక్తికరమైన పరిణామం చోటు చేసుకుంది. వైద్య, ఆరోగ్యశాఖపై జరిగిన సమీక్షలో అనూహ్యంగా మేడ్చల్ జిల్లా వైద్య, ఆర్యోగ్యశాఖ అధికారి దాస్యనాయక్ అనూహ్యంగా ఓ ప్రతిపాదన చేశారు. మేడ్చల్ జిల్లాలో వైద్య సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని, జిల్లా జనాభాకు సరిపడా ప్రభుత్వ ఆసుపత్రులు లేవని వీటిపై సభలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని ఆయన ప్రజా ప్రతినిధులను వేడుకున్నారు. దయచేసి మంత్రిగారూ... ఇతర ప్రజా ప్రతినిధులు మా జిల్లాపై దృష్టిపెట్టాలని కోరారు. జనాభాకు సరిపడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేవని దీనిపై ప్రజా ప్రతినిధులు దృష్టిపెట్టాలని కోరారు. మేడ్చల్ జిల్లాలో 25లక్షలకుపైగా జనాభా ఉన్నారని కేవలం ప్రస్తుతం 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మాత్రమే పనిచేస్తున్నాయని ఇటీవలే 17 అర్బన్ పీహెచ్‌సీలు మంజూరయ్యాయని ఇవి కాక మరో 35 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేసే బాధ్యత ప్రజా ప్రతినిధులు తీసుకోవాలన్నారు. సాధారణంగా జడ్పీ సమావేశాల్లో జిల్లా స్థాయిలో నిర్ణయాలు తీసుకోలేని అంశాలు అయితే సభ్యులు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపుతారు. కానీ అధికారే ప్రజలకు ఉపయోగపడే మంచి పనిపై చొరవ తీసుకుని ప్రతిపాదన చేసి పంపాలని జడ్పీ సభ్యులను కోరడం గమనార్హం. సానుకూలంగా స్పందించిన మంత్రి మహేందర్‌రెడ్డి మేడ్చల్‌తో పాటు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో కూడా ఎక్కడెక్కడ ప్రభుత్వ ఆసుపత్రుల అవసరమో అధ్యాయనం చేసిన ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

● సబ్‌కలెక్టర్‌పై సభ్యుల గుస్సా..

వికారాబాద్ సబ్ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పనితీరుపై కొందరు సభ్యుల్లో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టే రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు ఇసుక, కంకర తరలింపుపై తరుచూ ఆంక్షలు విధిస్తున్నారని ఇలా అయితే ప్రభుత్వ పథకాలు ఎలా ముందుకు వెళతాయని సభ్యులు ప్రశ్నించారు. సమావేశంలో ఇసుక కొరతంగా అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయని ఇసుక కోసం ప్రభుత్వానికి డీడీలు చెల్లించినా కూడా ఇసుక ఇవ్వడం లేదని సభ్యులు వాపోయారు. మా ఇంటికి ఏమైనా ఇసుక అడుగుతున్నామా? ప్రభుత్వ పనులకే ఇవ్వకుంటే ఎలా అని వారు ప్రశ్నించారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని సబ్ కలెక్టర్ నోటీసులు ఎలా ఇస్తారని మంత్రి మహేందర్‌రెడ్డి పక్కనే ఉన్న కలెక్టర్ దివ్యను అడిగారు. ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక సరఫరా చేస్తున్నామని ఈ విషయంలో ఏం జరిగిందో తాను తెలుసుకుంటానని సమాధానమిచ్చారు.

ఘనంగా ఫొటోగ్రాఫర్స్ డే



తాండూరు: తాండూరు ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, అనాథశ్రమంలో చిన్నారులకు పండ్లు, బ్రెడ్లు, పాల డబ్బాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సునితాసంపత్, వైస్ చైర్మన్ ఆసిఫ్‌తో రవికుమార్, శరణు, శ్రీనివాస్, వెంకట్, నితిన్, రమేష్, శివకుమార్, హీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.

‘ఇసుక’ విక్రయిస్తామన్నా కొనేవారేరి..?

- సవాలక్ష నిబంధనల కారణంగా అమ్ముడుపోని సాండ్
- 1000 ట్రాక్టర్ల ఇసుక ఉన్నా ఒక్క ట్రాక్టర్ కూడా అమ్మని వైనం


ఇసుక(ఫైల్)

తాండూరు: జిల్లా వ్యాప్తంగా ఇసుక దొరకని కారణంగా పలు భవనాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇంటి నిర్మాణదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రైవేటుగా ఇసుక విక్రయించేందుకు కలెక్టర్ ఒక పాలసీని రూపొందించి మైన్స్ అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ఇంటి నిర్మాణదారుడికి 4 ట్రాక్టర్లకు మించకుండా ఇసుకను విక్రయించాలని ఒక ఇసుక ట్రాక్టర్‌కు రూ.1500ల ధర నిర్ణయించారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి ప్లాన్, ఎస్టిమెట్‌తోపాటు ఇంటి ఫొటోను జతపరచి తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటే ఇసుకను విక్రయిస్తామని నిబంధన విధించారు. రూ.25వేల డిపాజిట్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న ట్రాక్టర్ ద్వారానే ఇసుక రవాణా చేసుకోవాలని నిబంధనలో సూచించారు. అయితే కాగ్నా, కాక్రవేణి నది నుంచి సుమా రు 1000 ట్రాక్టర్ల ఇసుకను తవ్వి తాండూరు పట్టణ గ్రీన్ సిటి వద్ద డంపింగ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు నిర్మాణాలు, మరుగుదొడ్లు, ఇతర నిర్మాణాలకు సంబంధించి ఇసుక కేటాయిస్తామని ప్రైవేటు నిర్మాణదారులకు శుభవార్త వినిపించారు. 3 మాసాలైనా ఇసుక కోసం ఎవరూ ముందుకు రాకపోవడం విశేషం. అడ్డదారిలో ఇసుక కొనుగోళ్లకు ఆసక్తి చూపే ఇంటి నిర్మాణదారులు పలు నిబంధనల కింద దరఖాస్తు చేసుకుని కార్యాలయం చుట్టూ తిరగడమెందుకని భావించారో లేక నాలుగు ట్రాక్టర్ల ఇసుక ఏం చేద్దామనుకున్నారోగానీ దరఖాస్తు చేసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం అధికారులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇసుక అవసరాలు ఉన్నా స్పందించకపోవడం విశేషం.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్.. తృటిలో తప్పిన ప్రమాదం

- ఎర్త్, న్యూట్రల్ వైర్‌కు కరెంటు సరఫరా
- రైతులు, కూలీల భయాందోళన


ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఇదే

బషీరాబాద్: వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్, న్యూట్రల్ వైర్లు అస్తవ్యస్తంగా ఉండటంతో కరెంటు సరఫరా జరిగి వరి నాటేస్తున్న కూలీలు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో నారుమడి చేస్తున్న రైతుకు, ఎద్దులకు షాక్ తగిలి ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ సంఘటన బషీరాబాద్ మండలం బహద్దూర్‌పూర్ తండా శివారులో శుక్రవారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన పోతుగంటి బాలప్ప పొలంలో మధ్యన ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్, న్యూట్రల్ వైర్లు అస్తవ్యస్థంగా ఉండటంపై శుక్రవారం సాయంత్రం పొలంలోకి విద్యుత్ సరఫరా అయింది. దీంతో పొలంలో వరి నాటేస్తున్న రైతు, కూలీలకు కరెంటు షాక్ తగలడంతో ఒక్కసారిగా భయపడి పొలం ఒడ్డుకు చేరుకున్నారు. వరి పొలంలో నారుమడిని ఎద్దులతో చేస్తుండగా ఎద్దులకు, రైతు హన్మంతుకు కరెంటు షాక్ తగిలి కొంత సేపు ఉక్కిరిబిక్కిరి కాగా, ఎద్దు స్పృహతప్పి పడిపోయాయి. ఇది గమనించిన స్థానిక రైతులు కర్రలతో ఎర్త్ వైర్లను తొలగించినట్లు రైతు హన్మంతు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికుడు ప్రకాష్ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేస్తే సరఫరా నిలిపివేశారని, ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటికి మార్చాలని ఆయన డిమాండ్ చేశారు.

మంత్రులను కలిసిన స్టోన్, క్వారీ అసోసియేషన్ ప్రతినిధులు

తాండూరు: నాపరాయి లీజుల మంజూరీలో వివిధ నిబంధనలు పెట్టి వ్యాపారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, నిబంధనలు సడలించాలని కోరుతూ మంత్రి మహేందర్ రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కరణం పురుషోత్తంరావు సమక్షంలో తాండూరు స్టోన్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్వర్‌ఖాన్, క్వారీ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, అసోసియేషన్ ప్రతినిధులు చంద్రశేఖర్, మురళి, అన్వర్‌ఖాన్, మంత్రి కేటీఆర్‌ను కలిసి విన్నవించారు. నష్టాల్లో ఉన్న నాపరాయి పరిశ్రమను కుటీర పరిశ్రమగా గుర్తించాలని, రాయల్టీ తగ్గించాలని విన్నవించారు. లీజులకు ఎన్‌వోసీ క్లియరెన్స్‌ను వెంటనే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జీఎస్టీని 28శాతం నుంచి 5శాతానికి తగ్గించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కేటీఆర్ ఎనిర్వాల్‌మెంట్ అనుమతులపై నిబంధనలను సడలించాలని, ఎన్‌వోసీని తొందరగా ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని మైన్స్ డైరెక్టర్ సుశీల్‌కుమార్‌కు ఆదేశాలిచ్చారు. వ్యాపారులు విన్నవించే సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు నాపరాయి వ్యాపార ప్రతినిధులు పేర్కొన్నారు.

రేపు జినుగుర్తి రామలింగేశ్వర స్వామి జాతర

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి రామలింగేశ్వరస్వామి జాతరను ఈనెల 21న శ్రావణ సోమవారం అమావాస్య సందర్భంగా నిర్వహించడం జరుగుతుందని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21న ఉదయం 5.35 గంటలకు సుప్రభాతసేవ, కళశపూజ, స్వస్తి పుణ్యహావచనం, ఏకాదశరుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, ఉదయం 11.5 గంటలకు భవానీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణం, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి మహేందర్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఈవో వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఐసీఎల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

తాండూరు రూరల్: మండలంలోని సంగెంకలాన్‌లో శనివారం ఇండియా సిమెంట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుభాష్ చంద్రభోస్ ఆధ్వర్యంలో ఐసీఎల్ యాజమాన్యం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డయాబెటిస్, కంటి పరీక్షలను నిర్వహించారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

తాండూరు రూరల్: మండలంలో కోణాపూర్‌లోని అభయాంజనేయస్వామి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. అభిషేకాలు, హోమం, నవగ్రహపూజలు, విఘ్నేశ్వర పూజ, అన్నదానం నిర్వహించారు. మంత్రి మహేందర్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు పైలెట్ రోహిత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ రమేష్, టీడీపీ ఇన్‌చార్జీ రాజుగౌడ్ పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్‌రాంరెడ్డి, ఉపసర్పంచ్ రాజుగౌడ్, ఆర్ వెంకటేష్, బిచ్చయ్యగౌడ్, ఆశప్ప పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

డాక్ సేవకుల సమ్మెకు కాంగ్రెస్ సంఘీభావం


డాక్ సేవకుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న రమేశ్

తాండూరు: సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని డాక్ సేవక్‌లు పేర్కొన్నారు. డాక్ సేవకులు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. వంటవార్పుతో నిరసన వ్యక్తం చేశారు. తాండూరు పోస్టల్ కార్యాలయ ఆవరణలో సమ్మెలో ఉన్న డాక్ సేవకులు సమ్మెలో ఉన్న డాక్ సేవకులకు తాండూరు కాంగ్రెస్ ఇన్‌చార్జీ ఎం.రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ సునితాసంపత్ వేర్వేరుగా సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆసీఫ్, కాంగ్రెస్ కౌన్సిలర్లు శ్రీనివాస్, రవికుమార్, పీఏసీఎస్ చైర్మన్ ధారాసింగ్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు ఉత్తంచంద్, డాక్ సేవలు వీరేందర్, షఫీ, శంకర్, అంజయ్య, బస్వరాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘చిన్నారులకు మీజిల్స్, రుబెల్లా టీకాలు వేయించాలి’

యాలాల: దేశం నుంచి రుబెల్లా వైరస్‌ను పారద్రోలి దేశానికి ఆరోగ్య భారతావనిగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అచ్చుతాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గ్రామంలో మీజిల్స్, రుబెల్లా టీకాల కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నెలల నుంచి 15ఏళ్లలోపు పిల్లలందరికీ మీజిల్స్, రుబెల్లా టీకాలను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జోత్స్న, ఉపాధ్యాయులు రమేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎల్.మహిపాల్‌రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు 28 మంది విద్యార్థుల ఎంపిక

పెద్దేముల్: తెలంగాణ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం పెద్దేముల్ జోన్ నుంచి బాలికల కబడ్డీలో 28 మంది విద్యార్థినిలను ఎంపిక చేశారు. ఇందులో అండర్-14, అండర్-17కు సంబంధించి జోనల్ ఎంపిక చేశామని ఎస్‌జీఎఫ్ పెద్దేముల్ జోనల్ కార్యదర్శి రాధాకృష్ణ తెలిపారు. ఎంపిక ప్రక్రియలో ఎంఈవో శ్రీనివాస్, మాజీ సెక్రటరీ గౌరీశంకర్, ఆర్.క్రిష్ణయ్య, హరిక్రిష్ణ, శ్వేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యవర్గం ఎన్నిక

తాండూరు: తాండూరు పట్టణ కాంగ్రెస్ కార్యవర్గాన్ని పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా నవాజ్, సాయిరెడ్డి, రామకృష్ణ, ఎంకె.రమేష్, మున్షద్, ఫయాజ్, వెంకటరాములు, రహ్మాన్, ఏసుదాస్, ప్రధానకార్యదర్శిగా సయ్యద్, బషర్‌అలీ, కోశాధికారిగా జ్ఞానేశ్వర్, స్పోక్స్‌పర్సన్‌గా బాబు వారణాసి, కార్యదర్శిగా గడ్డం వెంకటేష్, నారా అశోక్, కాశీం, జావిద్‌ఖాన్, విఠల్, సహ కార్యదర్శిగా ఫుర్కాన్, శ్రీనివాస్‌గౌడ్, సయ్యద్ ఇబ్రహీం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కెఎన్.రాజు, రమేష్, సమద్, ఖయ్యూం పాషా, మిట్టి వెంకటేష్‌లను నియమించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆశోక్

తాండూరు రూరల్: తాండూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా కరన్‌కోట్ గ్రామానికి చెందిన అశోక్ నిమితులయ్యారు. తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ ఎం.రమేష్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిత్, మాజీ జడ్పీటీసీ రాకేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

బషీరాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజవర్ధన్‌రెడ్డి

బషీరాబాద్: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజవర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ రమేష్ నియామక పత్రాన్ని అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాండూరు రూరల్: విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా గౌతాపూర్ సబ్ స్టేషన్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ మహిపాల్ తెలిపారు. గౌతాపూర్, గోపన్‌పల్లి, చెంగోల్, చింతామణిపట్నం, పర్వతాపూర్, అంతారం, అంతారం తండా గ్రామాల రైతులు గ్రామస్తులు గమనించాలని కోరారు.

కేసీఆర్ హామీ నెరవేరేనా.?

- మేడ్చల్ నియోజకవర్గంలోని చెరువులకు గోదావరి జలాలు..
- 75 వేల ఎకరాలకు సాగునీరందిస్తాం
- గ్రామసభల్లో రైతులకు హామీలిచ్చిన సీఎం



శామీర్‌పేట పెద్ద చెరువు

శామీర్‌పేట : సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలయ్యేనా, నిజంగా ఆ చెరువుల్లోకి గోదావరి జలాలు వచ్చి మహర్దశ పట్టేనా అని అన్నదాతలు అంటున్నారు. సీఎం కేసీఆర్ నిజంగా పట్టువదలని విక్రమార్కుడిలా హామీని నిలబెట్టుకోవాలనే తపనతో పాములపర్తి రిజర్వాయర్ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను శామీర్‌పేట పెద్ద చెరువులోకి మళ్లిస్తే మండలంలోని భూములు సస్యశ్యామలమవుతాయని, అంతకంటే గొప్ప మహర్దశ ఎంకేముంటుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు. శామీర్‌పేట పెద్ద చెరువులోకి గోదావరి నది నుంచి సాగు జలాలు వస్తాయని, మా ప్రాంతంలో పడావులుగా వున్న ఆయకట్టు, ఇతర భూములు సస్యశ్యామలమై నిరులు పండుతాయని 60 ఏళ్లగా మండల రైతులు ఎంతో ఆశగా ఎదిరి, ఎదురుచూస్తున్నారు. గోదా వరి నది సాగు జలాలను సుజల స్రవంతి పథకం కింద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా శామీర్‌పేట పెద్ద చెరువులోకి గోదావరి జలాలను తీసుకువచ్చి మండల ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తాం, శాశ్వతంగా కరువును నివారిస్తామని రాష్ట్ర పాలకులు 60 ఏళ్లగా చెపుతున్నారే తప్ప దాన్ని ఆచరణలో మాత్రం పెట్టడం లేదని మండల రైతులు విమర్శిస్తున్నారు. మండల ప్రాంత రైతులు ఏళ్ల తరబడి వర్షాధారం పైనే ఆధారపడుతూ సరైన పంటలను పండించలేక కరువుతో అల్లాడుతూ ఆందోళన చెందుతున్నారు.

ఎదురుచూపులు

60 ఏళ్లుగా ఎదురుచూపులు..



పాలకులు గోదావరి నది జలాలను శామీర్‌పేట పెద్ద చెరువులోకి మళ్లించి నింపుతారని 60 ఏళ్లగా ఎదురుచూస్తున్నాం. మండల ప్రాంత రైతులకు సాగునీటి వనరులు లేక వర్షాధారం పైనే ఆధారపడి పంటలను పండిస్తున్నాం. సరైన వర్షాలు కురవక పోతే దిక్కు తోచని దుస్థితిలో కరువుతో అల్లాడి పోతున్నాం.

- శామీర్‌పేట, రైతు వంగ సాయిరెడ్డి

గోదావరి జలాలను మళ్లించాలి



వచ్చే ఏడు నుంచి శామీర్‌పేట మండలంలోని అన్ని చెరువుల్లోకి గోదావరి నది జలాలను మళ్లించి పంట పొలాలను సస్యశ్యామలం చేసి, సీఎం కేసీఆర్ మండల గ్రామ సభల్లో రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. హామీలను విస్మరించకుండా సీఎం కేసీఆర్ సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి.

- సింగం అంజనేయులు, శామీర్‌పేట మండల రైతు సంఘం అధ్యక్షుడు

పెద్ద చెరువుకు వర్షాధారమే..

ఈ పెద్ద చెరువులోకి నీరు రావాలంటే కేవలం వర్షధారమే దిక్కుగా ఉంది. ఆయకట్టు రైతులకు నీటి వనరులు లేవు. ఆయకట్టు పొలాల్లో బోరు బావులను తవ్వించినా నీరు పడడం లేదు. వర్షాధారం నీరు మాత్రమే మండల ప్రాంత రైతులకు దిక్కుగా ఉంది. వర్షం నీటి వరదలతోనే ఈ చెరువులోకి నీరొస్తుంది. ఇతర నీటి వనరులు లేక శామీర్‌పేట పెద్ద చెరువు ఏళ్ల తరబడి ఎడారిగా తలపిస్తుండంతో ఆయకట్టు రైతు దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

శామీర్‌పేట చెరువు జిల్లాలోనే పెద్దది

సరైన వర్షాలు కురవక నేడు శామీర్‌పేట పెద్ద చెరువు తేలిన రాళ్లతో దర్శనమిస్తోందని. సాగు నీటి వనరులు లేక ఆ ప్రాంత రైతులు కరువుతో ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం శామీర్‌పేటలో రాజీవ్ రహదారికి ఆనుకుని పెద్ద చెరువు ఉంది. ఈ చెరువు పేరును 1978లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి జవహర్ సరస్సు(చెరువు)గా నామకరణ చేశారు. అప్పట్లో ఈ చెరువు కట్టపై ఆ సీఎం కాస్తా పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి పనులను చేపట్టారు. ఈ పెద్ద చెరువులోకి నది సాగు నీటి వనరులు లేక, వర్షం నీరు రాక ప్రస్తుతం ఈ పెద్ద చెరువు రాళ్ళు, రప్పలతో దర్శనమిస్తోంది.

శిఖం సామర్థ్యం 1200 ఎకరాల విస్తీర్ణం

శామీర్‌పేట పెద్ద చెరువు నీటితో నిండే శిఖం (ఎఫ్‌టీఎల్) ఏరియా సామర్థ్యం (కెపాసిటీ) దాదాపు 1200 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ చెరువు నీటి లోతు 33 ఫీట్లు సామర్థ్యం కలిగి ఉంది. దీంతో ఇంత పెద్ద చెరువు నీటితో నిండుగా నిండి చెరువు కట్ట(బండ) తెగిపోయే ప్రమాదం లేదు. కాగ చెరువులో ఎన్ని నీళ్ల వచ్చాయని తెలవడానికి కొలమానంగా ఏడు గజాల గుండు ఉంది. ఈ గుండు మునిగేలా నీరు వస్తే ఈ చెరవు పూర్తిగా నీటితో నిండినట్లే, దాంతో రెండు సీజన్లకు గాను ఖరీఫ్, రబీలకు ఆయకట్టు కింద రైతులకు పంటలు సాగవుతాయి.

ఆయకట్టు సాగు 2600 ఎకరాలు


ఈ పెద్ద చెరువు పూర్తిగా నీటితో నిండితే ఆయకట్టు కింద అధికారికంగా మండలంలోని శామీర్‌పేట, బాబాగూడ, అలియాబాద్, జగ్గంగూడ ప్రాంతల పరిధిలోని రైతులకు చెందిన 2600 ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన వరి పంట సాగవుతుంది. ప్రస్తుత 2017లో వర్షాకాలం ఆరంభమై సగం సీజన్ ముగిసినప్పటికీ ఇంత వరకు ఈ పెద్ద చెరువులోకి కేవలం 5శాతం మేరకు మాత్రమే వర్షం నీరు వచ్చి చేరింది. ఈ పరిస్థితిని బట్టి సాగు నీటి వనరులు ఈప్రాంత రైతులకు ఏ మేరకు ఉన్నయో అర్థమవుతోంది.

పెద్ద చెరువులకు మహర్దశ పట్టేనా.?

గోదావరి నది జలాలను తన గజ్వేల్ నియోజకర్గంలోని పాములపర్తిలో ఏర్పాటు చేస్తున్న రిజర్వాయర్ ప్రాజెక్టులోకి మళ్ళించి, అక్కడి నుంచి శామీర్‌పేట పెద్ద చెరువుతో పాటు లక్ష్మాపూర్, లాల్‌గడి మలక్‌పేట పెద్ద చెరువు, అలాగే మేడ్చల్ నియోజకవర్గంలోని అన్ని చెరువుల్లోకి పెద్ద కాలువ ద్వారా మళ్ళించి నింపి 75 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తానని, తన నియోజకవర్గ ప్రాంతం లాగా ఈ ప్రాంతాన్ని కూడా సాగు నీటి జలాలతో సస్యశ్యామలం చేస్తానని ప్రజల హర్షధ్వానాల మధ్య సీఎం కేసీఆర్ బహిరంగంగా ప్రకటిస్తు రైతులకు హామీ ఇచ్చారు. ఈ గోదావరి జలాలను మేడ్చల్ నియోజకవర్గంలోని చెరువుల్లోకి మళ్లించేందుకు అలైన్‌మెంట్ కూడా ఫిక్స్ అయిందని ఆ గ్రామ సభల్లో సీఎం కేసీఆర్ రైతులకు హామిలిచ్చారు.

వ్యవ'సాయం'

- దొరకని కూలీలు.. పెరిగిన ధరలు..
- వ్యవసాయ పనులకు తీవ్ర ఇబ్బందులు
- తలలు పట్టుకుంటున్న రైతులు



పత్తిచేనులో కలుపు తీస్తున్న కూలీలు

యాలాల : పల్లెల్లో వ్యవసాయ సాగు విస్తీర్ణం పెరగడంతో కూలీల రేట్లు రెండింతలకు చేరుకున్నాయి. సన్న, చిన్నకారు రైతులకు పంట చేలల్లో కలుపు తీసేందుకు కూలీలు దొరక్క అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వర్షాలు కురియడంతో పత్తి, మొక్కజొన్న, పెసర, మినుము పంటలు సాగు చేస్తున్న రైతులకు కలుపు తీసి ఎరువులు వేస్తే పంట పెరిగి దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుంది. పంట చేలల్లో కలుపు తీసేందుకు కూలీలు రాకపోవడంతో అన్నదాతలు తలలు పట్టుకుంటున్నారు. ఎంతో ఖరీదైన విత్తనాలు తెచ్చి పంట సాగు చేస్తే కలుపు తీయకుండా ఎరువులు వేస్తే వృధాగా పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని కూలీలు రేట్లను పెంచేశారు. రోజువారీ కూలీ రూ.150లు ఉండగా, పత్తిలో కలుపు తీయడానికి రూ.250లు, వరినాటుకు రూ.250లకు పెంచారు. అడిగిన కూలీ ఇస్తామన్నా కూలీలు రావడం లేదని రైతులు వాపోతున్నారు. యాలాల మండలంలో కూలీల కొరత ఉండటంతో రైతులు ఎకరా పత్తి చేను కలేపు తీయడానికి రూ.2500లకు గుత్తాకు ఇస్తున్నారు. కూలీలు ఎప్పుడైనా వచ్చి పత్తి చేలల్లో కలుపు తీసిపోగానే రైతులు అప్పులు చేసి కూలీలకు నగదు చెల్లిస్తున్నారు.

హరితహారానికి కూలీల కొరత

పల్లెల్లో ప్రభుత్వం చేపట్టిన హరిత హారం కింద మొక్కలు నాటేందుకు కూలీల కొరత ఏర్పడుతోంది. వ్యవసాయ పనులకు పోతే రూ.200ల నుంచి రూ.250లు నగదు చెల్లిస్తుండటంతో గ్రామాల్లోని కూలీలు అందరూ వ్యవసాయ పనులకు వెళతున్నారు. హరితహారంలో కూలీ ఇస్తామని చెప్పినా మొక్కలు నాటేందుకు కూలీలు రావడం లేదు. దీంతో గ్రామాల్లో మొక్కలు నాటే లక్ష్యం చేసేందుకు అధికారులు నానా తిప్పలు పడాల్సి వస్తుంది. గ్రామానికి 40వేల మొక్కలు నాటే లక్ష్యం ఆదిలో ఆగిపోతుందని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

వ్యవసాయ పనులను ఉపాధిహామీలో చేర్చాలి

గ్రామీణ ప్రాంతాల రైతులు వ్యవసాయ పనులు చేసేందుకు పెరిగిన ధరలను చెల్లించడానికి రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఉపాధి హామీ పనులు చేయడం వల్లే కూలీల రేట్లు పెరిగిపోయి రైతులు వ్యవసాయం చేసే పరిస్థితులు చేజారిపోతున్నాయి. సన్న, చిన్నకారు రైతుల వ్యవసాయ పులకు వచ్చే మహిళా కూతలకు జాతీయ ఉపాధి హామీ ఈపథకంలో చేర్చాలని గ్రామీణ ప్రాంత రైతులు కోరుతున్నారు. పంటలు సాగు చేసే రైతులు రసాయన ఎరువులు, కూలీ రేట్లు చెల్లిస్తే చివరి వరకు రైతుకు ఏమీ మిగలడం లేదని వ్యవసాయం చేసే బదులు కూలీ పనులకు వెళ్లడం మేలని రైతులు వాపోతున్నారు.

వ్యవసాయం ఎలా చేయాలి



అడపాదడపా వర్షాలు కురవగానే కూలీలు ధరలు పెంచారు. మేము ఎక్కడి నుంచి డబ్బులు తెచ్చివ్వాలి. ముగ్గురికి ఇచ్చే కూలీని ఇద్దరు కూలీలకు ఇవ్వాల్సి వస్తుంది. కూలీ రేట్లు పెంచినా, పొలాలకు వెళ్లి కూడా పనులు త్వరగా చేయడం లేదు. మేము ఇచ్చే డబ్బులు కలుపు, నాటు, దున్నడానికి సరిపోతున్నాయి.


- అమృతయ్య, రైతు, జక్కేపల్లి

ఉపాధిహామీలో చేర్చాలి



సన్న, చిన్నకారు రైతులు పెట్టుబడులు పెట్టక ఎకరం, రెండు ఎకరాలు ఉంటే బీడుగా వదిలేస్తున్నారు. వ్యవసాయ పనులకు వచ్చే కూలీలకు ఉపాధిహామీ పథకంలో కూలీలు చెల్లించే అవకాశం కల్పిస్తే మాలాంటి వారు కాస్త వ్యవసాయం చేసుకుని బతికేందుకు వీలుంటుంది.

- రాంచంద్రారెడ్డి, రైతు, రాస్నం





- నేడు ప్రపంచ దోమల నివారణ దినం
- రోనాల్డ్ రాస్ మలేరియా వ్యాధికి దోమ కారకమని కనుగొన్న రోజు
- జిల్లాను వణికిస్తున్న మలేరియా, డెంగీ వ్యాధులు
- డెంగీకి అందుబాటులో లేని మందులు
- చికిత్స కన్నా నివారణే ముఖ్యం
- పరిసరాల పరిశుభ్రతే నివారణకు మార్గం

కాటేస్తే.. చేటే

అనేక రకాల ప్రాణాంతకమైన వ్యాధుల వ్యాప్తికి కారకమైన, పరిచయం అవసరం లేని సూక్ష్మజీవి దోమ. తన కాటు ద్వారా మానవుల రక్తాన్ని పీలుస్తూ, తద్వారా వ్యాధులను వ్యాపింపజేసి ఏటా ఎంతోమందిని బలి గొంటోంది ఈ జీవి. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రవేత్తలు ఇప్పటివరకు 3,500 రకాల దోమల జాతులను గుర్తించగా వాటిలో చాలావరకు ప్రమాదకరమైనవేనని పరిశోధనల్లో తేలింది. నేడు ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

- వికారాబాద్ (ఫీచర్స్), యాచారం

ఈ రోజునే ఎందుకు జరుపుకుంటారంటే..

ప్రపంచ వ్యాప్తంగా అంతుచిక్కని వ్యాధి భారిన పడి లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయిన సందర్భంలో మన దేశంలో వైద్యుడిగా పని చేస్తున్న ప్రఖ్యాత బ్రిటీష్ శాస్త్రవేత్త రోనాల్డ్ రాస్ 1897, ఆగస్టు 20న నూతన పరిశోధనలకు శ్రీకారం చుట్టాడు. తన పరిశోధనల ద్వారా దోమ కాటు వల్ల సంక్రమిస్తున్న మలేరియా వ్యాధి వల్లే ప్రజలు మృత్యువాత పడుతున్నారని ఆయన నిరూపించారు. అంతేకాకుండా వ్యాధి వ్యాపించే విధానాన్ని ప్రయోగాత్మకంగా నిరూపణ చేసి చూపించారు. అంతే కాకుండా ప్రజల పాలిట మృత్యువుగా పరిణమించిన దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలను ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకై ఆగస్టు 20వ తేదీని ప్రపంచ దోమల నివారణ దినంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రత్యేక దినాన దోమ కాటు వల్ల కలిగే అనర్థాలు, వ్యాపించే వ్యాధులు, వాటి నివారణా మార్గాలపై ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. అందుకే అప్పటి నుంచి ఏటా ఈ రోజున అంతర్జాతీయ దోమల నివారణ దినంగా నిర్వహిస్తూ పలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు.

మలేరియా, డెంగీ వ్యాధులు

వైద్య రంగంలో నూతన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత తరుణంలోనూ దోమ కాటు వల్ల వ్యాపిస్తున్న మలేరియా, డెంగీ వ్యాధులు ప్రజలను వణికిస్తూనే ఉన్నాయి. మలేరియా వ్యాధి కారకమైన ఆడ ఎనాఫిలిస్ దోమ కాటు వల్ల ఏటా ప్రపంచ వ్యాప్తంగా కొన్ని మిలిమన్ల మంది ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. వికారాబాద్ జిల్లాలో ప్రతీ సంవత్సరం సుమారు 2 వేల మంది ఈ వ్యాధితో మరణిస్తున్నారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వీరిలో చాలా మందికి సరైన అవగాహన లేకపోవడం, సకాలంలో వైద్యం అందని కారణంగానే మరణిస్తున్నారు.

భయభ్రాంతులకు గురి చేస్తున్న డెంగీ...

దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధుల్లో అత్యంత ప్రమాదకరమైనదిగా డెంగీని చెప్పవచ్చు. ఎడిస్ ఈజిప్టీ అనే దోమ వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. మలేరియా వ్యాధి కారకమైన ఆడ ఎనాఫిలిస్ దోమకు, ఎడిస్ ఈజిప్టీ రకం దోమకు చాలా తేడాలున్నాయి. ఆడ ఎనాఫిలిస్ దోమ మురుగు నీటితో పుడుతుంది. అది కేవలం రాత్రి వేళల్లోనే ఎక్కువగా ప్రభావం చూపెడుతుంది. కానీ ఎడిస్ ఈజిప్టీ మాత్రం మంచి నీటిలో పుడుతుంది. రాత్రుల్లోనే కాకుండా పగటిపూట కూడా కాటువేస్తూ అత్యంత వేగంగా డెంగీ వ్యాధిని వ్యాప్తి చెందిస్తుంది. ఈ వ్యాధి భారిన పడి ఇటీవలి కాలంలో వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. వ్యాధి వ్యాపించే విధానం, నివారణా మార్గాలపై సరైన అవగాహన లేకపోవడంతో చాలా మంది విద్యావంతులు కూడా ఈ వ్యాధికి బలవుతుండడం గమనార్హం.

డెంగీకి అందుబాటులో లేని మందులు...

మలేరియా వ్యాధి నివారణకు ప్రస్తుతం పలు రకాల మందులు అందుబాటులో ఉన్నప్పటికీ డెంగీ వ్యాధిని అరికట్టేందుకు మాత్రం ఎలాంటి మందులు ఇప్పటివరకు కనుకొనలేదు. అందువల్ల ఈ వ్యాధిని మలేరియా కన్నా కూడా చాలా ప్రమాదకరమైనదిగా చెప్పవచ్చు. రాత్రి వేళల్లో మాత్రమే సంచరించే మలేరియా వ్యాధి కారక ఆడ ఎనాఫిలిస్ దోమల నుంచి రక్షించుకునేందుకు దోమ తెరల వినియోగం, ఫాగింగ్, దోమల నివారణ మందులను స్ప్రే చేయడం, మస్కిటో కాయిల్స్ వాడడం, రకరకాల ఆయింట్‌మెంట్‌ల వినియోగం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. కానీ డెంగీ వ్యాధి కారకమైన ఎడిస్ ఈజిప్టీ దోమల నివారణకు ఇప్పటిదాకా ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో లేవు. ముఖ్యంగా వ్యాధి వ్యాపించే విధానంపై మెజార్టీ ప్రజలకు అవగాహన లేకపోవడంతో గత కొన్నేళ్లలో డెంగీ భారిన పడి మృతి చెందుతున్న వారి సంఖ్య జిల్లాలో పెరుగుతూ వస్తోంది. ఏటేటా మృతుల సంఖ్య పెరుగుతున్నా ప్రభుత్వం, అధికారులు వ్యాధి నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

డెంగీ లక్షణాలు..

డెంగీ వ్యాధిని మొదట్లోనే గుర్తించడం చాలా కష్టం. జులై నుంచి డిసెంబరు మధ్యలో ఈ వ్యాధి ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. విపరీతమైన జ్వరం, తరచూ జ్వరం వస్తూ, పోతూ ఉండడం, మితిమీరిన నీరసం, ఒళ్లు నొప్పులు, రక్త కణాల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడం వంటివి డెంగీ వ్యాధి లక్షణాలుగా చెప్పవచ్చు. అయితే ప్రత్యేక నిర్ధారిత పరీక్షల ద్వారా మాత్రమే ఈ వ్యాధిని గుర్తించడం వీలవుతుంది.

నివారణే ఉత్తమ మార్గం..

దోమ కాటు వల్ల సంక్రమించే వ్యాధుల నివారణకు పూర్తి స్థాయిలో మందులు కనుగొనడం సాధ్యం కాకపోవడంతో వాటి నివారణే ఉత్తమ మార్గమన్న వాస్తవాన్ని ప్రజలంతా గుర్తించాల్సిన అవసరం ఉంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమల వ్యాప్తిని చాలా వరకు అరికట్టేవీలుంది. దోమల భారి నుండి కాపాడుకోవడానికి ప్రస్తుతం అనేక మార్గాలు అందుబాటులో ఉన్నాయి. అన్నింటికన్నా ముఖ్యంగా దోమ తెరలను వాడడం అత్యంత శ్రేయస్కరమని శాస్త్రవేత్తలు, వైద్యులు సూచిస్తున్నారు. దోమ తెరలను వాడడం వల్ల ఆఫ్రికా దేశాల్లో మలేరియా మృతులను 50 శాతం వరకు తగ్గించగలిగారు.

తీసుకోవాల్సిన చర్యలు...

కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదకరమైన దోమల వ్యాప్తిని చాలా వరకు అరికట్టవచ్చు. ముఖ్యంగా మురుగు గుంతల్లో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, ఎక్కువ కాలం నీటి నిల్వ లేకుండా చేయడం, పరిసరాల పరిశుభ్రతను పాటించడం, ఆరుబయట మలవిసర్జనకు స్వస్తి పలికి తప్పనిసరిగా మరుగుదొడ్లను వినియోగించడం, టాయిలెట్ల వినియోగంలో పరిశుభ్రతను పాటించడం, దోమలు ఇంట్లోకి రాకుండా తగు చర్యలు తీసుకోవడం, దోమల బ్యాట్‌లను వాడడం వంటి చర్యల ద్వారా వీటి వ్యాప్తిని చాలా వరకు అరికట్టవచ్చు.

నివారణతోనే వ్యాధులు దూరం



దోమలను నివారించుకుంటేనే ఏలాంటి వ్యాధులు ప్రబలవు. పరిసరాలలో మురుగు గుంతలు లేకుండా చూసుకోవాలి. మురుగు గుంతల్లో విధిగా గంబూచియా చేపలు పెంచితే 80శాతం మేర దోమలను నివారించుకోవడం చాలా సులభం. ఇళ్లలో దోమ తెరలు, ఆలౌట్ వాడాలి. కిటికీలకు మెష్‌లు పెట్టుకుంటే చాలా మంచిది.

- డాక్టర్ సంధ్య,యాచారం

ఆదిభట్ల సిగలో మరో ఆణిముత్యం

- న్యుకాన్ ఏరోస్పేస్ ఏర్పాటుతో మరింత ఖ్యాతి
- కేటీఆర్ చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభం
- అంతర్జాతీయ సంస్థల రాకతో ప్రపంచ పటంపై ఆదిభట్లకు చెరగని ముద్ర
- అంతరిక్ష, రక్షణ రంగ విడి భాగాల ఉత్పత్తి కేంద్రానికి ఆదిభట్లలో శ్రీకారం

ఆదిభట్ల: అంతర్జాతీయ సంస్థల రాకతో ప్రపంచ పటంపై చెరగని ముద్ర వేసిన ఆదిభట్ల శిగలో మరో ఆణి ముత్యం మెరిసింది. పలు ఐటీ పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధి అంతా ఆదిభట్ల పరిసర ప్రాంతాలలోనే కేంద్రీకృతంతో ఇప్పటికే గుర్తింపు పొందిన ఆదిభట్లలో అంతరిక్ష, రక్షణ రంగ విడిభాగాల తయారీలో విశేష అనుభవం కల్గిన న్యుకాన్ ఏరోస్పేస్ అంతార్జాతీయ సంస్థ ఏర్పాటుతో ఆదిభట్ల పేరు అంతర్జాతీయంగా మరోసారి తెరపైకి వచ్చింది. ఆదిభట్లలో అంతర్జాతీయ సంస్థల ఏర్పాటుతో ప్రపంచ చిత్రపటంపై తనదైన ముద్ర వేసిన అందులో టీసీఎస్ సంస్థతో మొదలుకొని టాటా ఏరోస్పేస్, టాటా అడ్వాన్స్ సిస్టం, టాటా లాటీన్ మాటీన్, రక్షణ శాఖకు సంబంధించిన వైమానిక దిగ్గజాలుగా పేర్కొనదగిన బోయింగ్ లాంటి సంస్థలు వేల మంది సిబ్బందితో ఇప్పటికే పనులు ప్రారంభించగా కొన్ని నిర్మాణం దిశలో ఉన్నాయి. ఐటీ పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధి పథంలో దూసుకెళ్తుంది.

న్యుకాన్ ఏరోస్పేస్‌తో మరింత గుర్తింపు

హైదరాబాద్ కేంద్రంగా న్యుకాన్ ఏరోస్పేస్ విమానయాన, రక్షణ రంగ ఉత్పత్తులకు సంబంధించి అత్యాధునిక యంత్ర సామగ్రి కల్గి ఉన్న సంస్థ న్యుకాన్ ఏరోస్పేస్ సంస్థను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, హోంశఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డిల చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభించడంతో ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న ఆదిభట్ల పేరు మరో సారి తెరపైకి వచ్చింది. సముద్రం, భూమి మరియు అంతరిక్ష, రక్షణ రంగ సంస్థల కోసం అత్యంత ఖచ్చితత్వం కల్గిన నియంత్రణ వ్యవస్థలను తయారు చేయడంలో అగ్రగామి సంస్థగా గుర్తించబడిన సంస్థ న్యుకాన్ ఏరోస్పేస్ సంస్థ తమ అతి పెద్ద ఉత్పత్తి మరియు అసెంబ్లీ ఏవియేషన్ స్పేస్, రక్షణ రంగ ఉత్పత్తుల టెస్టింగ్ సదుపాయాన్ని ఆదిభట్ల వద్ద ఏర్పాటు చేయడంతో రానున్న రోజుల్లో ఆదిభట్ల ఎంతో అభివృద్ధి పదంలోకి రానున్నట్లు ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

అంబరాన్నంటిన తీజ్ పండగ

కందుకూరు: తెలంగాణ సంస్కృతి గిరిజనుల సంప్రదాయాలను ప్రతిభింబించే తీజ్ పండగను మురళీనగర్ గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. మూడు రోజుల పాటు గ్రామంలో బొడ్రాయి(నాబీశిల) పండగను జరుపుకున్న గిరిజన ప్రజలు శనివారం తీజ్ పండగను జరుపుకున్నారు.ఈ ఉత్సవాలకు మహేశ్వరం ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ముఖ్యఅతిథులుగా హాజరైయ్యారు. ఆయన గ్రామస్థులు సమిష్టిగా కలిసి తీజ్ పండగను జరుపుకోవడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. రాబోయే రెండు సంవత్సరాల్లో ప్రతి గ్రామంలో ఇంటింటికి నల్లా ద్వార మంచినీరు అందించనున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచిన విద్యుత్‌ను సరఫరాచేస్తున్నట్లు తెలిపారు. మురళీనగర్ నుంచి నేదునూరు వరకు ఉన్న నాలుగు కిలోమీటర్ల మెటల్ రోడ్డును బీటీ రోడ్డుగా ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలో మౌలికవసతుల కల్పనకు 10లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో జరుపుకునె తీజ్ పండగ మన సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అమృత, ఎంపీటీసీ సభ్యురాలు జయ్యమ్మ, మండల సహకార సంఘం చైర్మన్ ఎస్ మల్లేష్, ఎంపీటీసీ సభ్యులు సరికొండ పాండు, సర్పంచ్‌లు యాదయ్య, అంజయ్య, నాయకులు ఎజి అంజయ్య, లక్ష్మీనర్సింహ్మారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, కాకి ధశరథ, నాయకులు జవహర్‌నాయక్, రాంచందర్, రాంసింగ్, శంకర్ పాల్గొన్నారు.


మురళీనగర్‌లో తీజ్‌పండగలో పాల్గొన్న ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

డబ్ల్యూహెచ్ఓ రాయబారి మిల్కాసింగ్

కరెంట్ అఫైర్స్



రామచంద్రారెడ్డి ఉప్పుల

అంతర్జాతీయం

పోలియో రహిత దేశంగా సోమాలియా

ప్రపంచ ఆరోగ్య సంస్థ సోమాలియాను పోలియో రహిత దేశంగా ఆగస్టు 13న ప్రకటించింది. మూడేళ్లగా సోమాలియాలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆఫ్ఘనిస్థాన్, నైజీరియా, పాకిస్థాన్‌లలో మాత్రమే పోలియో కేసులు నమోదవుతున్నాయి. సోమాలియాలో చివరిగా 2014లో పోలియో కేసు నమోదైంది. సోమాలియాను పోలియో రహిత దేశంగా ప్రకటించినా వ్యాధికి గురయ్యే అవకాశాలు ఉన్నందువల్ల టీకాలను నిరంతరం అందించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది.

బార్సిలోనాలో ఉగ్రదాడి



స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఆగస్టు 17న ఉగ్రవాదులు జరిపిన దాడిలో 13 మంది మరణించారు. బార్సిలోనాలోని లస్ రంబ్లస్ రహదారిలో ఉగ్రవాదులు వ్యానుతో పాదచారుల పైకి దూసుకెళ్లడంతో పలువురు గాయపడ్డారు. దాడి తమ పనేనని ఐసిస్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. పోలీసులు ఐదుగురు ఉగ్రవాదులను కాల్చి చంపారు. పర్యాటకులు, జనసంచారంతో ఉండే ఈ దారిని దాడికి ఉగ్రవాదులు ఎన్నుకొన్నారు. 2004లో స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో అల్‌ఖైదా ప్రేరేపిత ఉగ్రవాదులు రైళ్లలో పేలుళ్లకు పాల్పడటంతో 191 మంది మరణించారు.

అమెరికా ఉగ్ర జాబితాలో 'హిజ్బుల్ ముజాహిదీన్'

కశ్మీర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హిజ్బుల్ ముజాహిదీన్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించింది. హిజ్బుల్ అధిపతి సయ్యద్ సలావుద్దీన్‌ను రెండు నెలల క్రితం అంతర్జాతీయ ఉగ్రవాదిగా అమెరికా ప్రకటించింది. 1989లో ఏర్పాటైన హిజ్బుల్ కశ్మీర్‌లో పెద్ద ఉగ్రవాద సంస్థల్లో ఒకటి. తాజా ప్రకటనతో ఆ సంస్థకు నిధుల సమీకరణ కష్టతరం కానుంది. ఆంక్షల కారణంగా హిజ్బుల్‌పై చట్టపరమైన సంస్థలు చర్యలు చేపట్టడానికి వీలుంటుంది.

జాతీయం

రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల దిగుబడి

దేశంలో ఆహార ధాన్యాల దిగుబడి 2016-17 సంవత్సరంలో రికార్డు స్థాయిలో నమోదైంది. 2016-17 మొత్తం 27.56 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయినట్లు కేంద్రం ఆగస్టు 16న ప్రకటించింది. 2015-16లో 25.17 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల దిగుబడి వచ్చింది. వరి దిగుబడి 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు పెరిగింది. గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, పప్పు ధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది.

ఇన్ఫోసిస్ సీఈవో విశాల్ సిక్కా రాజీనామా



ఇన్ఫోసిస్ సీఈవో విశాల్ సిక్కా తన పదవికి ఆగస్టు 18న రాజీనామా చేశారు. సీఈవోగా తప్పుకొన్న సిక్కాను కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గా నియమించారు. తాత్కాలిక సీఈవో & ఎండీగా యూబీ ప్రవీణ్ రావును నియమించారు. 2014 జూన్ 12న సిక్కా ఇన్ఫోసిస్ సీఈవో & ఎండీగా బాధ్యతలు చేపట్టారు. 1986లో ఇన్ఫోసిస్‌లో చేరిన ఆయన ప్రస్తుతం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీఐఐ నేషనల్ కౌన్సిల్, నాస్కామ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ప్రవీణ్ సభ్యుడిగా ఉన్నారు. ఇన్ఫోసిస్ బీపీవోకు కూడా ప్రవీణ్ ఛైర్మన్.

డబ్ల్యూహెచ్ఓ రాయబారి మిల్కాసింగ్

పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ సౌహార్ద రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి మిల్కాను ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంపిక చేసింది. ఈ ప్రాంతంలో 2025 నాటికి శారీరక శ్రమ 90 శాతం ఉండేలా, అంటువ్యాధులు కాని రోగాల విస్తృతిని 25 శాతానికి పరిమితం చేసేలా డబ్ల్యూహెచ్ఓ కార్యాచరణ రూపొందించింది. దీనికి ప్రచారకర్తగా మిల్కాను నియమించింది.

పురస్కారం

శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

చత్తీస్‌గఢ్ పోలీస్ జవానుకు ఈ ఏడాది అత్యున్నత పోలీస్ పురస్కారం లభించింది. కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం 'రాష్ట్రపతి పోలీస్ శౌర్య' పతకాన్ని ప్రకటించారు. 2015లో నక్సల్స్‌తో జరిగిన పోరులో చత్తీస్‌గఢ్ పోలీస్ ప్లటూన్ కమాండర్ శంకర్‌రావు ప్రాణాలు కోల్పోయారు. పోలీస్ విభాగంలో అత్యున్నత పురస్కారంగా భావించే రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని పొందారు.

ఐదుగురికి 'కీర్తిచక్ర'

శాంతి సమయంలో సైనికులకు ఇచ్చే రెండో అత్యున్నత పురస్కారం 'కీర్తిచక్ర'కి ఈ సారి ఐదుగురిని ఎంపిక చేశారు. వీరిలో ముగ్గురికి మరణానంతరం ప్రకటించారు. వారిలో గూర్ఖా రైఫిల్స్‌కి చెందిన హవాల్దార్ గిరిస్ గురుంగ్, నాగా రెజిమెంట్‌కు చెందిన మేజర్ డేవిడ్ మన్లుం, సీఆర్పీఎఫ్ 49వ బెటాలియన్ కమాండెంట్ ప్రమోద్ కుమార్ ఉన్నారు. గార్వారా రైఫిల్స్‌కు చెందిన మేజర్ ప్రీతం సింగ్, సీఆర్పీఎఫ్ సీనియర్ అధికారి చేతన్‌కుమార్ చీతా కీర్తిచక్ర పొందిన మిగిలిన ఇద్దరు.

క్రీడలు

బల్గేరియా ఓపెన్ విజేత లక్ష్యసేన్



బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ టైటిల్ విజేతగా భారత యువ క్రీడాకారుడు లక్ష్యసేన్ నిలిచాడు. బల్గేరియా రాజధాని సోఫియాలో జరిగిన టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష్యసేన్ 18-21, 21-12, 21-17తో క్రొయేషియాకు చెందిన రెండో సీడ్ డురకిన్ జాక్‌పై గెలిచి టైటిల్ సొంతం చేసుకొన్నాడు. లక్ష్యకు ఇది రెండో అంతర్జాతీయ టైటిల్. గతేడాది ఇండియా ఇంటర్నేషనల్ సిరీస్ టైటిల్‌ను గెలుచుకొన్నాడు. ప్రస్తుతం జూనియర్ ప్రపంచ నెంబర్ వన్‌గా ఉన్న లక్ష్యసేన్‌కు సీనియర్ విభాగంలో ఇది రెండో అంతర్జాతీయ టైటిల్.

శ్రీలంకతో టెస్ట్ సిరీస్ క్లీన్‌స్వీప్



శ్రీలంకతో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లీ సేన ఘనత సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' శిఖర్ ధావన్‌కు, 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు హర్దిక్ పాండ్యకు లభించింది. చివరి టెస్టులో భారత ఇన్నింగ్స్ 171 పరుగులతో విజయం సాధించింది. తాజా విజయంతో టెస్టు ర్యాంకింగ్‌లో భారత్ 125 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

రోజర్స్ కప్ విజేత అలెగ్జాండర్

